సూర్య www.suryaa.com
17వ వసంతంలోకి...
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

# నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

మంగళవారం | 13 ఆగస్టు 2024 | విజయవాడ

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్య, ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

సంపుటి 17 | సంచిక 253
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, శ్రావణ మాసం శుద్ధ అష్టమి తె.4.56, విశాఖ పూర్తి, వర్జ్యం ఉ.11.43 నుంచి 1.25 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం మ.12.29 నుంచి 1.19 వరకు తిరిగి మ.3.00 నుంచి 3.50 వరకు

## దేశంలోనే బెస్ట్ హాస్పిటల్స్‌గా ప్రభుత్వ ఆసుపత్రులు

- వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయండి
- టెలి మెడిసిన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు
- గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టుపట్టించడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది
- కిడ్నీ బాధితుల వివరాలు మండలాల వారీ సేకరించాలి
- ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత తప్పని సరి, రోగులకు శుభ్రమైన బెడ్ షీట్లు అందించాలి
- డోలీ మోతలు కనిపించకూడదు...ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా రోగులను తరలించాలి
- వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు




2లో

వైద్య ఆరోగ్య శాఖలో 2014-19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అస్తవ్యస్థ విధానాలతో గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించిందని, తద్వారా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మళ్లీ నమ్మకం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.

## విక్రమ్ సారాభాయే అందరికీ ఆదర్శం

- భారత అంతరిక్ష రంగ పితామహుడుకి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళులు
- దేశానికి శాటిలైట్ ఆవశ్యకత తెలియజేసిన మహానుభావుడు
- ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో కీలక పాత్ర

సోమవారం మన దేశం అంతరిక్ష పరిశోధన, తత్సంబంధిత రంగాల్లో గణనీయ విజయాలు సాధిస్తుందీ అంటే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ఈ రంగంలో విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ దూర దృూష్టే కారణమని ఆయన వివరించారు. భౌతిక శాస్త్ర పరిశోధనాలయం ఏర్పాటు చేయడం, మన దేశానికి శాటిలైట్ ఆవశ్యకత గురించి నాటి ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారిని ఒప్పించడం, ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడం ద్వారా దేశంలో అంతరిక్ష రంగం అభివృూద్ధి చెందింది.



2లో

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులు



6లో

- 150 మంది మహిళా సర్పంచ్‌లకు ఆహ్వానం
- ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేసిన వారిపై దృష్టి
- ఏపీ నుంచి కూడా వెళ్లేందుకు పలువురికి అవకాశం

## సుప్రీంను ఆశ్రయించిన సీఎం కేజ్రీవాల్

- సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్
- తనను విడుదల చేయాలని కోరిన సీఎం
- అత్యవసర విచారణ జరపాలని కోరిన కేజ్రీవాల్ న్యాయవాది
- మెయిల్ అభ్యర్థన పంపాలన్న చీఫ్ జస్టిస్



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ప్రధాని మోడీ రికార్డు

### ఎర్రకోటపై వరుసగా 11వ సారి జెండా ఆవిష్కరణ



6లో

- నెహ్రూ, ఇందిరల సరసన మోడీ
- సరాసరి 82 నిమిషాలు ప్రసంగం
- యూపీఏ హయాంలో మన్మోహన్ 10 సార్లు

భారత ప్రధానిగా ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ చరిత్ర సృూష్టించనున్నారు. వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రికార్డును ప్రధాని మోడీ ఇప్పటికే సమం చేశారు. అంతేకాదు.. వరుసగా 11 సార్లు ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. జాతినుద్దేశించి ప్రసంగించిన మూడో ప్రధానిగా చరిత్రలో నిలిచిపోనున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



5లో

### సెన్సెక్స్ 56, నిఫ్టీ 20 పాయింట్లు చొప్పున నష్టం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. హిండెన్బర్గ్- అదానీ వ్యవహారం మరోసారి చర్చకు రావడంతో ఆ ప్రభావం సూచీలపై పడింది. ఆరంభంలో దీని ప్రభావం ఎక్కువగా ఉన్నప్పటికీ.. తర్వాత సూచీలు కోలుకున్నాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.

## హర్ ఘర్ తిరంగా మనందరి బాధ్యత!


- ప్రతి ఒక్కరూ ఈ పండగలో ఉత్సాహంగా పాల్గొనాలి
- జాతీయ సమైక్యతను కాపాడటం మనందరి బాధ్యతన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



7లో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి కోరారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా.. హైదరాబాద్ లోని తమ నివాసంలో కిషన్ రెడ్డి దంపతులు జాతీయ జెండాను ఎగురవేశారు.

### అంతా ఇంతే!



ప్రభుత్వ డాక్టర్ల సంగతేంటీ సార్

## రాష్ట్రంలోని సహజ వనరుల్ని కాపాడుకుంటాం

- గత ఐదేళ్ల పాలనలో సహజ వనరుల్ని దోచుకున్నారు
- శాస్త్ర సాంకేతికంగా మైనింగ్ శాఖను పటిష్ట పరిచేలా చర్యలు తీసుకుంటాం
- నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ 6వ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో అంతులేని సహజ వనరులున్నాయని, వాటిని రాష్ట్ర అభ్యున్నతికి వినియోగిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.



2లో

## పోలీసులకు సీఎం మమత డెడ్‌లైన్



6లో

- వారం రోజుల్లో కేసు ఛేదించకపోతే కేసు సీబీఐకి అప్పగిస్తా
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరగాలని కోరుకుంటున్నాం
- విద్యార్థులు కోరుకుంటే సీబీఐకి అప్పగించేందుకు రెడీ : మమత

## ఉక్రెయిన్ మార్గంలో బంగ్లాదేశ్


- నిన్నటి వరకు మిత్రదేశం.. నేడు శత్రువు...
- బంగ్లాదేశ్‌లోనూ ఉక్రెయిన్ తరహా పరిస్థితులు
- భారత్-బంగ్లా మైత్రి కొనసాగేనా?
- హసీనాను అప్పగించండి

2024 జూన్ నెలలో మొదలైన ఉద్యమం, జులై నాటికి తీవ్రరూపం దాల్చి హింసాత్మకంగా మారింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన ఈ ఆందోళనల్లో పలువురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు.



6లో

సూర్య
విజయవాడ
మంగళవారం
13 ఆగస్టు 2024
2



# సీఎం చంద్రబాబుతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల భేటీ

అమరావతి :– ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు భేటీ అయ్యారు. సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్ తో కలిసి వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడుతో సోమవారం బ్యాంక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. నలుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గత రెండు రోజులుగా అమరావతిలో పర్యటిస్తోంది. ఈ బృందంలో వరల్డ్ బ్యాంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ స్పెషలిస్ట్ రఘు కేశవన్, లీడ్ ట్రాన్స్పోర్ట్ స్పెషలిస్ట్ గెరాల్డ్ పాల్ అలీవియర్,సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ కింగ్ యున్ షెన్, సౌత్ ఏషియా అర్బన్ ప్రాక్టీస్ మేనేజర్ అబేదాలిరజాక్ ఎఫ్.ఖలీల్ ఉన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడ వచ్చిన ప్రపంచ బ్యాంక్ బృందం....మధ్యాహ్నం వరకూ విజయవాడ సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. సీఆర్డీయే గురించి అమరావతి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులు బృందానికి వివరించారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. రెండో రోజు ఆదివారం రాజధానిలోని రోడ్లను, కొండవీటి వాగు ఎత్తిపోతల పంప్ హౌస్ ను పనులను పరిశీలించడం తో పాటు విట్, ఎస్ఆర్ఎం, ఎయిమ్స్ లను పరిశీలించారు. సోమవారం సెక్రటేరియట్ లో సీఎం చంద్రబాబుతో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణంలో ఎలా ముందుకెళ్తుందనేదానిపై వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులకు సీఎం వివరించారు.

## దేశంలోనే బెస్ట్ హాస్పిటల్స్‌గా

# ప్రభుత్వ ఆసుపత్రులు

- వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయండి
- టెలి మెడిసిన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు
- గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టుపట్టించడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది
- కిడ్నీ బాధితుల వివరాలు మండలాల వారీ సేకరించాలి
- ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత తప్పని సరి, రోగులకు శుభ్రమైన బెడ్ షీట్లు అందించాలి
- డోలీ మోతలు కనిపించకూడదు...ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా రోగులను తరలించాలి
- వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైద్య ఆరోగ్య శాఖలో 2014–19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అస్తవ్యస్థ విధానాలతో గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించిందని, తద్వారా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మళ్లీ నమ్మకం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సమీక్షలో చంద్రబాబు మాట్లాడుతూ....ప్రభుత్వం తరవున యాప్ రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి సంబంధించిన వివరాలు పొందుపరచాలి. ఆసుపత్రి రోగికి అందించే వైద్య సేవలు, ఎక్విప్ మెంట్, ఇచ్చే మెడిసిన్ వివరాలు కూడా ఉండాలి. ఇలా చేయడం వల్ల ఆసుపత్రి పనితీరు ఎలా ఉందో తెలుస్తుంది. రాష్ట్రంలో కిడ్నీ బాధితులు ఎంత మంది ఉన్నారో మండలాల వారీగా వివరాలు సేకరించాలి. కిడ్నీ సమస్య కారణాలపై అధ్యయనం చేయాలి. కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి సదుపాయంపైనా లోతైన అధ్యయనం చేయాలి. గతంలో ఉద్దానంలో పూర్తిస్థాయిలో రీసెర్చ్ చేయడం వల్లే పూర్తిస్థాయిలో సమస్యను గుర్తించగలిగాం. ఉద్దానంలాగే ఇప్పుడు మరికొన్ని ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా సిటీ స్కాన్ సర్వీసెస్ ను ముందుగా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలి. ప్రి ల్యాబ్ టెస్ట్ ల అనంతరం పేషెంట్లకు సరైన విధానంలో మెడిసిన్ ఇవ్వగలిగితే 50 శాతం కంట్రోల్ చేయొచ్చు. రోగులకు డైట్ ప్లాన్, న్యూట్రిషన్ పై అవగాహన కల్పించగలిగితే వ్యాధుల నుండి కాపాడవచ్చు. రాష్ట్రంలో టీబీ రోగులు ఎంతమంది ఉన్నారో సమగ్ర అధ్యయనం చేసి వారికి కంటిన్యూగా మెడిసిన్ అందించాలి. ఆసుపత్రులలో ప్రసవం తర్వాత శిశువుల మిస్సింగ్ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...మిస్సింగ్ కేసులు వస్తే అధికారులపై చర్యలు తప్పవు. ఎన్టీఆర్ బేబీ కిట్స్ ను మళ్లీ తల్లులకు అందించాలి. బేబీలకు అవసరమైన సామాగ్రిని కిట్స్ ద్వారా అందించాలి. ప్రతి స్కూలులో పిల్లలకు కంటి పరీక్షలు చేసిన తర్వాత ఏం యాక్షన్ తీసుకున్నారో రిపోర్టు చేయాలి. టెలీ మెడిసిన్ కు గతంలో వరల్డ్ బ్యాంకు నుండి రూ.2,300 కోట్లు నిధులు తీసుకొచ్చాం. కార్పొరేట్ లెవల్లో సేవలు అందించాలని నిర్ణయించాం. గ్రామాల్లో ఉండేవారికి టెలీ మెడిసిన్ ద్వారా మంచి డాక్టర్లతో అందించాలని నిర్ణయించాం. కానీ దాన్ని గత ప్రభుత్వం సరిగా అమలు చేయలేదు. టెలీ మెడిసిన్ పై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలి. అంగవైకల్యంతో బాధపడేవారికి వివిధ రూపాల్లో పెన్షన్ అందిస్తున్నాం. సదరం ఫేక్ సర్టిఫికేట్ల జారీపై చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై పూర్తిస్థాయిలో సమాచారం కోసం పంచాయతీ రాజ్ శాఖతో కలిసి పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలి అని సీఎం అన్నారు. డోలీ మోతలు కనిపించ కూడదు ఫీడర్ అంబులెన్స్ కు సాధారణ అంబులెన్స్ కు కనెక్టివిటీ పెంచాలి. డోలీతో ఇంకా మోసుకొస్తున్న సందర్భాలు కనబడుతున్నాయి. డోలీ మోతలు మళ్లీ రిపీట్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఫీడర్ అంబులెన్స్ లు వెళ్లగలిగినప్పటికీ సాధ్యంకాదని నిర్లక్ష్యం వహిస్తే నేరుగా నేనే ఆ ప్రాంతాన్ని సందర్శిస్తా. 104 అంబులెన్సుల పట్ల ప్రజల్లో సంతృప్తి ఉందా లేదా అన్నది ముఖ్యం. ఏదో వెళ్లి కొన్ని టెస్టులు చేసి వచ్చి మొత్తం పరిష్కరించామని చెప్పడం సరికాదు... ప్రజల సంతృప్తిపై ఆరా తీయాలి. ఆసుపత్రుల్లో చనిపోయిన వారి దేహాలను ఇంటికి చేర్చాలన్న ఉద్దేశంతో గతంలో మహాప్రస్థానం అంబులెన్స్ లను తీసుకొచ్చాం...వాటిని కూడా మరుగున పెట్టారు. అవసరాన్ని బట్టి అంబులెన్స్ ల వినియోగాన్ని పెంచాలి. ఆసుపత్రుల్లో రోగులకు అందించే బెడ్ షీట్లు కూడా నాణ్యత, శుభ్రంతో ఉండాలి. ప్రజల్లో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధిపై అవగాహన తీసుకురాగలిగితే మరణాలను తగ్గించవచ్చు. రాష్ట్రంలో జోన్ల వారీగా సర్వీస్ ప్రొవైడర్ మానిటర్ ఏర్పాటు చేసి ఆసుపత్రుల్లో చేసే శానిటేషన్ ను అబ్జర్వేషన్ చేయాలి. మెడ్ టెక్ జోన్ పట్ల గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. యేడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ మెడ్ టెక్ జోన్ ద్వారా జరుగుతోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల మెడికల్ ఎక్విప్ మెంట్ ను అందిస్తోంది. అయినా దీన్ని గత ప్రభుత్వం వినియోగించుకోలేదు. నియోజకవర్గం స్థాయిలో పీపీపీ విధానంలో ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం...వారికి ప్రభుత్వమే స్థలం అందిస్తుంది. ప్రభుత్వ, పీపీపీ ఆసుపత్రలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తాం. దేశంలోనే ఏపీ ఆసుపత్రుల పనితీరు బెస్ట్ గా ఉండాలి. అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# రాష్ట్రంలోని సహజ వనరుల్ని కాపాడుకుంటాం

- గత ఐదేళ్ల పాలనలో సహజ వనరుల్ని దోచుకున్నారు
- శాస్త్ర సాంకేతికంగా మైనింగ్ శాఖను పటిష్ట పరిచేలా చర్యలు తీసుకుంటాం
- నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ 6వ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో అంతులేని సహజ వనరులున్నాయని, వాటిని రాష్ట్ర అభ్యున్నతికి వినియోగిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఢిల్లీలో కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి, అనుశాఖ సహాయమంత్రి డా.జితేంద్ర సింగ్, కేంద్ర మైనింగ్ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మినలరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ 6వ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జ్ఞాపిక అందించి, శాలువాతో మంత్రి కొల్లు రవీంద్ర సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ లో అపారమైన సహజ వనరులు, విభిన్నమైన ఖనిజ వనరులు ఉన్నాయని, వాటిని సరైన మార్గంలో వినియోగించుకుంటే రాష్ట్రం అభివృద్ధిలో దేశానికి మార్గదర్శిలా నిలుస్తుందని అన్నారు. వనడియం, టైటానియం, నికెల్, ఫోస్పోరైట్, ఫాస్పేట్, గ్రాఫైట్, లిథియం, ప్లాటినం లాంటి విలువైన వనరులు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న వనరులని సాంకేతికంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా 1996 లో నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. మినరల్స్ తవ్వకాలకు 2% సీనరేజ్ ఫీజుగా నిర్ణయించారు. ఆ సొమ్మునే రాష్ట్ర ఖనిజన్వేషణకు వినియోగిస్తున్నారు. ఈ వ్యవస్థ సేవలను సమగ్రంగా వినియోగించుకోవడం, మెరుగు పరచడమే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే సమయంలో రాష్ట్రంలోని మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర నిఘా కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడలిచామని, అందుకు కేంద్ర ప్రభుత్ర గనుల శాఖ కార్యదర్శి కాంతారావుని సహకారం అందించాలని అడిగారు.

ఆంధ్రప్రదేశ్ కు దాదావు 972 కి.మీ.ల తీర ప్రాంతం ఉన్నందున సముద్ర ప్రాంతంలో వనరుల అన్వేషణకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. తద్వారా.. పాలీమెటాలిక్ నోడ్యూల్స్, పాలీమెటాలిక్ సల్ఫైడ్లు మరియు ఇతర వనరులు కూడా అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఆఫ్షోర్ మైనింగ్ యాక్ట్ 2002కి ఇటీవలి సవరణలు, ఆఫ్షోర్ ఖనిజాలున్న ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడానికి వీలు కల్పించడంపై చర్చించారు. తీరప్రాంత రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు రాబోయే ఆఫ్షోర్ మైనింగ్ నిబంధనలను పరిశీలించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విన్నవించారు. ఆఫ్షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, అందుకోసం ప్రత్యేకంగా సీ బెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.

కార్యక్రమంలో అస్సాం మైన్స్ అండ్ మినరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి జోగన్ మోహన్, ఛత్తీస్ ఘర్ ఆరోగ్య శాఖ మంత్రి శ్యాం బిహారి జైస్వాల్, గుజరాత్ పరిశ్రమల శాఖ మంత్రి బల్వంత్ సింగ్ రాజ్ వుత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో కృష్ణమ్మ హారతి పునఃప్రారంభం

### దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : :గోదావరి–కృష్ణా సంగమ ప్రాంతమైన పవిత్ర సంఘమం(ఇబ్రహీంపట్నం) ఫెర్రీ వద్ద నెలరోజుల్లోగా కృష్ణమ్మ హారతి కార్యక్రమాన్ని వున:ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో కృష్ణమ్మ హారతి కార్యక్రమం వున:ప్రారంభానికి సంబంధించి ఏర్పాటైన మంత్రుల బృందం(జిఓఎం)సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గతంలో సియం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పవిత్ర సంఘమం వద్ద కృష్ణమ్మ హారతిని ఒక పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమంగా నిత్యం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే గత ఐదేళ్ళ కాలంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మరలా కృష్ణమ్మహారతిని నెల రోజుల్లోగా వున:ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కావున కృష్ణమ్మ హారతి నిర్వహహణకు గాను పవిత్ర సంఘమం–ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద అవసరమైన కనీస మౌలిక సదుపాయాలైన రహదార్లు,విద్యుత్,బస్సు రవాణా,పారిశుద్ధ్య నిర్వహణ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో వునరుద్దరించేందుకు సంబంధిత శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ఎన్టిఆర్ జిల్లా యంత్రాంగం,జలవనరులు,సిఆర్డిఏ,దేవాదాయశాఖ, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం,పోలీస్, ట్రాన్సుకో,మున్సిపల్ తదితర శాఖల అధికారులు వారి స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహించుకుని తగు చర్యలు చేపట్టాలన్ని మంత్రి ఆదేశించారు. రానున్న రోజుల్లో పవిత్ర సంఘం వద్ద కేవలం కృష్ణమ్మ హరతికే పరిమితం కాకుండా ఆప్రాంతాన్ని ఒక పవిత్ర ఆధ్యాత్మిక మరియు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని ఆదిశగా తగిన చర్యలు తీసుకోనున్నట్టు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించి ఏర్పాటైన మంత్రుల కమిటీ తొలి సమావేశం జరిగిందని అధికారుల స్థాయిలోను,జిల్లా యంత్రాంగం స్థాయిలోను సంబంధింత శాఖల అధికారులతో మరిన్ని సమావేశాలు నిర్వహించి త్వరిత గతిన కృష్ణమ్మ హారతిని వున:ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాజమహేంద్రవరంలో గోదావరి హారతి ప్రస్తుతం కొనసాగుతోందని దానిని మరింత పటిష్టవంతంగా నిర్వహించేందుకు కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కె.పార్ధసారధి మాట్లాడుతూ కృష్ణమ్మ హారతి అనేది ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని దానిని నెలరోజుల్లోగా వున:ప్రారంభించేందుకు చర్యలు తీసుకోడం జరుగుతుందని తెలిపారు. అక్కడ టిటిడి లేదా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఒక దేవాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆప్రాంతాన్ని రాష్ట్రానికే ఒక ప్రముఖ పర్యాటక,ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు.అక్కడకు వచ్చే పర్యాటకులు,భక్తులు తదితరులకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ఆదిశగా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.కృష్ణమ్మ హారతి కార్యక్రమాన్ని వునరుద్దరించడంతో పాటు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రముఖ వుణ్య క్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజి టూర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పార్ధసారధి సూచించారు.దేవాదాయశాఖ కమీషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ 2016 నుండి పవిత్ర సంఘమం వద్ద కృష్ణమ్మ హారతి నిర్వహించబడేదని కొవిడ్ అనంతరం నిర్వహించలేదని చెప్పారు.దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రతి రోజు నిత్య జలహారతిని దేవస్థానం నిర్వహిస్తోందని తెలిపారు.మరలా కృష్ణమ్మ హరతి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం



నిర్ణయించినందును అందుకు సంబంధించిన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సి ఉందని కావున సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ సృజన మాట్లాడుతూ ఇప్పటికే పవిత్ర సంఘమం,ఇబ్రహీం పట్నం ఫెర్రీవద్ద జంగిల్ క్లియరెన్సు పనులను చేపట్టడం జరిగిందని చెప్పారు.విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇఓ రామారావు మట్లాడుతూ కృష్ణమ్మ హారతి నిర్వహణకు 6పంట్లు,10 సెట్ల హరతులు అవసరం ఉందని చెప్పారు.అదే విధంగా మంచి సౌండ్ సిస్టమ్ తోపాటు 13 మంది అర్చకులు వారికి సహయకులుగా మరో 20 మంది సిబ్బంది అవసరం ఉందని అన్నారు.ఇంకా పోలీస్,సిఆర్డిఏ,ట్రాన్సుకో,ఐఅండ్ పిఆర్,అగ్నిమాపక,మున్సిపల్,పర్యాటక తదితర విభాగాల తరవున చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ఇంకా ఈసమావేశంలో డైరెక్టర్ ఫైర్ సర్వీసెస్ మురళి, విజయవాడ పశ్చిమ డిసిపి టి.హరికృష్ణ,ఇంకా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖైదీల క్షమాభిక్షపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం : హోమ్ మంత్రి అనిత

- జైళ్లలోని ఖైదీల స్థితిగతులపై హోమ్ మంత్రి అనిత స్పందన
- రాష్ట్రంలోని జైళ్లలో పరిమితికి మించి ఖైదీలు ఉన్నారని వెల్లడి
- విశాఖ జైలులో వెయ్యి మందికిపైగా గంజాయి కేసు నిందితులున్నారని వివరణ

ఏపీలోని వివిధ జైళ్లలో ఉన్న ఖైదీల స్థితిగతులపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. రాష్ట్రంలోని జైళ్లలో పరిమితికి మించిన ఖైదీలు ఉన్నారని తెలిపారు. రాజమండ్ర సెంట్రల్ జైలులోనే 1,250 మంది ఖైదీలు ఉన్నారని అనిత వెల్లడించారు. వారిలో 376 మంది గంజాయి కేసుల్లో నిందితులని వివరించారు. విశాఖ జైలులో వెయ్యి మందికి పైగా గంజాయి కేసు నిందితులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని కేంద్ర కారాగారాల్లో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, మానసిక వైద్య నివుణులను నియమిస్తామని అనిత చెప్పారు. ఖైదీల క్షమాభిక్షపై చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి ఘటనలోనైనా నిందితులను వారం రోజుల్లోపే పట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

### భారత అంతరిక్ష రంగ

# పితామహుడు విక్రమ్ సారాభాయ్



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఒక శాస్త్రవేత్త దేశం గురించి... తన చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచన చేస్తే ఎంతటి గొప్ప ఫలితాలు వస్తాయో దివంగత విక్రమ్ సారాభాయ్ జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. సోమవారం మన దేశం అంతరిక్ష పరిశోధన, తత్సంబంధిత రంగాల్లో గణనీయ విజయాలు సాధిస్తుందీ అంటే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ఈ రంగంలో విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ దూర దృష్టే కారణమని ఆయన వివరించారు. భౌతిక శాస్త్ర పరిశోధనాలయం ఏర్పాటు చేయడం, మన దేశానికి శాటిలైట్ ఆవశ్యకత గురించి నాటి ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారిని ఒప్పించడం, ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడం ద్వారా దేశంలో అంతరిక్ష రంగం అభివృద్ధి చెందింది. మన దేశం అంతరిక్ష రంగ పితామహుడుగా కీర్తి పొందిన శ్రీ విక్రమ్ సారాభాయ్ గారి జయంతి నేడు. ఆ మహనీయుడికి మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నాను. మన దేశం అంతర్జాతీయంగా అర్థవంతమైన పాత్ర పోషించగలగాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని చెప్పిన శ్రీ విక్రమ్ సారాభాయ్ గారి మాటలు నవతరం శాస్త్రవేత్తలు ఆచరణలో చూపాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయన అందించిన స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా సమాజానికి మేలు కలిగించే మరిన్ని పరిశోధనలు ఆవిష్కృతం కావాలన్నారు.

# హర్ ఘర్ తిరంగాపై చైతన్యం

### జాతీయ జెండాలు అందజేసి చైతన్యాన్ని నింపిన షేక్ షాజహాన్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: స్వాతంత్ర దినోత్సవం రోజున భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలువునిచ్చిన ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ షాజహాన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు అందజేసి చైతన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హర్ ఘర్ తిరంగా పేరిట బీజేపీ ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనుంది ఈ కార్యక్రమాన్ని జాతీయ పండగగా నిర్వహించాలని జులైలో మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ షేక్ షాజహాన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ జెండాలు అందజేసి స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై ఎగరవేయాలని కోరారు. ఇందులో భాగంగా ప్రముఖ సంఘ సేవకులు అర్షణ పల్లి దామోదర్ రావు కు జాతీయ జెండా అందించి జెండా ఔన్నత్యం గురించి, గొప్పతనం గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో కిరణ్ కూడా పాల్గొన్నారు.

### చేనేత వస్త్రాల అమ్మకమే లక్ష్యంగా

# రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్‌లు

### రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



విజయవాడ : చేనేత వస్త్రాల అమ్మకమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్త ంగా చేనేత ఎగ్జిబిషన్ లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవితగారు తెలిపారు. నగరంలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎగ్జిబిషన్ లో ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి నేతన్నలను పలుకరించారు. ఏయే రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేశారు.. రోజూ ఎంత మేర అమ్మకాలు అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఈ నెల ఏడో తేదీన గాంధీ బునకర్ మేళా పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈ నెల 20 తేదీ వరకు నిర్వహించాలని తొలుత నిర్ణయించామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఎగ్జిబిషన్ ను మరో వారం రోజుల పాటు పొడిగించనున్నట్లు మంత్రి తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాల్లో దళారుల ప్రమేయం లేకుండా, నేతన్నల కు మేలు కలగజేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు మరింత పెరిగేలా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వస్త్ర ప్రదర్శనలు(ఎగ్జిబిషన్ లు) నిర్వహించినున్నట్లు తెలిపారు. నేతన్నలకు శిక్షణ ఇచ్చి ఈ కామర్స్ లో చేనేత వస్త్రాలు విక్రయించే లా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

***మరో వారం పాటు ఎగ్జిబిషన్ పొడిగింపు***

ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే ఆనందంగా ఉందని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు. రోజుకు రూ.20 లక్ష లో మేర అమ్మకాలు జరుగుతుండడాన్ని దృష్టిలో పెట్టుకొని మరో వారం రోజుల పాటు ఎగ్జిబిషన్ పొడిగిస్తున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు.

***చీరలు కొనుగోలు చేసిన మంత్రి***

వస్త్ర ప్రదర్శనను పరిశీలించడానికి మంత్రి సవిత మూడు చీరలు కొనుగోలు చేశారు. ఆప్కో స్టాల్ దగ్గర 2 చీరలు, చీరాల స్టాల్ దగ్గర డ్రెస్ మెటీరియల్ మంత్రి కొనుగోలు చేశారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి కూడా చీరలు కొనుగోలు చేశారు.

***వస్త్ర ప్రదర్శన అద్భుతం***

వస్త్ర ప్రదర్శనకు వచ్చిన కొనుగోలు దారులతో మంత్రి సవిత ముచ్చటించారు. వస్త్ర ప్రదర్శన వల్ల మేలు కలిగిందా..అన్న మంత్రి ప్రశ్నకు కొనుగోలు దారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శన వల్ల నాణ్యమైన వస్త్రాలు కొనుగోలు చేసే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన బాగుందని, ఇకపై మరిన్ని చేనేత వస్త్ర ప్రదర్శనలు నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు.

***సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించిన మంత్రి***

కొనుగోలుదారులకు, నేతన్నలకు ఆహ్లాదం కలిగించేలా రోజూ ఆడిటోరియంలో ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేనేత ప్రదర్శనను పరిశీలించడానికి మంత్రి సవిత సోమవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం పలువురు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్ మూర్తి, జేడీ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ వ్యాన్‌ల ఫిట్ నెస్ పరీక్షలకు

# సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి :– అన్నమయ్య జిల్లా, ఓబులవారిపల్లె హైవే క్రాస్ సమీపంలో స్కూల్ వ్యాను బోల్తాపడిన ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ప్రమాదంలో భవిష్య అనే చిన్నారి మృతి చెందడంపై సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్కూల్ బస్సుల ఫిట్ నెస్ పై రవాణా శాఖ అధికారులు డ్రైవ్ నిర్వహించాలని, ఫిట్ నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# విద్యుత్ సమస్యలకు పరిష్కారం : గొట్టిపాటి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇవాళ గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలో పరిష్కారం చూపడంతో పాటు వినియోగదారులు చెల్లించే ఛార్జీలను తగ్గించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో విద్యుత్ రంగం కూడా తీవ్ర ఇబ్బందులపాలైందని, దాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో కొత్తగా విద్యుత్ ఉత్పత్తి జరగకపోవడం వల్ల ఛార్జీలు భారీగా పెంచాల్సి వచ్చిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయన్నారు. ఇందుకోసం కొత్త విద్యుత్ ప్లాంట్లు, సోలార్ విద్యుత్, రైతులకు కుసుమ్ యోజన్ వంటి పథకాలను అమలు చేసేందుకు సిద్ధమవున్నట్లు విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 6 నుంచి 7 శాతం పెరుగుతోందని, అందుకు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి చేయగలిగితే ఛార్జీలను అదుపులోకి తీసుకురావచ్చని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తిరుపతిలో మంత్రి వెల్లడించారు. 24 గంటల పాటు నిరంతరాయంగా వినియోగదారులకు విద్యుత్ అందిస్తామని ఆయన తెలిపారు.. అలాగే రైతులకూ నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు.

## ధాన్యం అమ్మిన 48 గంటల్లో

# రైతు ఖాతాకు సొమ్ము

- రైతు సహాయక కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్ల సరఫరా
- ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు
- కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి.. ప్రతి అడుగులో రైతుకి పెద్దపీట వేస్తాం
- అన్నదాతకు ఎలాంటి కష్టం లేకుండా అండగా నిలబడతాం
- గత ప్రభుత్వం రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది
- గత పాలకులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.1674 కోట్లు బకాయిపెట్టేశారు
- పౌరసరఫరాల శాఖనూ అప్పుల్లో ముంచేసింది
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించింది
- చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రానికి పునర్వైభవం తెస్తాం
- ఏలూరు రైతుల ధాన్యం బకాయిల చెల్లింపు కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతులకు రూ. 674 కోట్ల ధాన్యం బకాయిల విడుదల



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో రైతు పక్షపాతిగా నిలబడుతుంది. రైతన్నకు పెద్దపీట వేస్తుంది. రైతుకి ఎలాంటి నష్టం జరగకుండా అండగా నిలబడుతుంది. అన్నదాతకు ఆర్థిక కష్టాలు లేకుండా, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిలబడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు వేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని సంక్షోభంలో నెట్టిందనీ, రైతాంగం పడిన కష్టాలు ప్రత్యక్షంగా చూశామని, అలాంటి కష్టాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు ధాన్యం అమ్మిన 48 గంటల్లోపు సొమ్ము ఖాతాల్లో పడే ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకి అండగా నిలిచేందుకు పౌరసరఫరాల శాఖ, కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తాయని హామీ ఇచ్చారు. సోమవారం ఏలూరు జిల్లా కేంద్రంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రైతులకు గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను విడుదల చేశారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1674 కోట్లు ధాన్యం కొనుగోలు బకాయిలు ఉంచింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రూ. వెయ్యి కోట్లు విడుదల చేయగా, మిగిలిన రూ. 674 కోట్లను ఏలూరులో శ్రీ మనోహర్ గారు సోమవారం ఉదయం విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రైతులకు రూ. 472 కోట్ల ఒకేసారి రైతుల ఖాతాల్లో వేసే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ధాన్యం బకాయిలు ఆలస్యం అయినందుకు ప్రభుత్వం తరఫున రైతులను క్షమాపణలు కోరుతున్నాను. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఎన్నో కష్టాలు పడినా తట్టుకుని మీరంతా ముందుకు వెళ్తున్నారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. ధాన్యాన్ని అమ్ముకున్నా చేతికి డబ్బు చేరలేదు. నిబంధనలకు లోబడి రైతులు ధాన్యం అమ్ముకున్నా ప్రతి అడుగులో అక్రమాలు చోటు చేసుకున్నాయి. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వల్ల ఎంత నష్టం వాటిల్లిందో చూశాం. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని పవన్ కళ్యాణ్ , చంద్రబాబు నాయుడు గోదావరి జిల్లాల్లో పర్యటించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడిగితే, నాటి ప్రభుత్వంలో ఉన్న వారు రైతుల్ని ఎన్నో రకాలుగా ఇబ్బందిపెట్టారు. మిల్లర్ వద్దకు ధాన్యాన్ని తరలిస్తే రెండు రోజుల తర్వాత రమ్మనడం, స్లిప్పు తీసుకువెళ్తే తేమ శాతం తేడా ఉందని చెప్పడం. రైతుల నుంచి డబ్బు వసూలు చేయడం వంటి పనులు చేశారు.


**గత ప్రభుత్వం చేసిన తప్పులకు బ్యాంకర్లు ఫోన్లు ఎత్తడం మానేశారు..**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల ఆవేదన గురించి సమీక్ష జరిపితే అధికారులు చెప్పిన లెక్కలు చూసి భయం వేసింది. పౌరసరఫరాల కార్పోరేషన్ ని రూ. 40,550 కోట్ల రుణాల్లో ముంచేశారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 1674 కోట్ల ఉన్నాయని చెబితే వారిని ఎలా ఆదుకుంటామో అర్థం కాలేదు. నెల రోజుల్లోపే నిధులు సమకూర్చుకుని వారికి ఇవ్వాలని కూర్చున్నాం. అధికారులను ఢిల్లీకి పంపి నాబార్డు, ఎన్సీడీసీ అధికారులతో మాట్లాడి రుణాలు తెచ్చే ప్రయత్నాలు చేశాం. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకాలకు బ్యాంకర్లు ఫోన్లు ఎత్తడం మానేశారు. పరిస్థితిని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్తే రైతులకు వెంటనే బకాయిలు చెల్లించే ఏర్పాటు చేయమన్నారు. ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తెలియపర్చి సమన్వయపరచుకుంటూ గత నెలలో రూ. వెయ్యి కోట్లు చెల్లించే అద్భుత కార్యక్రమం చేశాం. మిగులు రూ. 674 కోట్లు ఇప్పుడు ఒకేసారి చెల్లించి రైతులకు భరోసా కల్పించే కార్యక్రమం చేపట్టాం.

**రైతులకూ ఈజ్ ఆఫ్ డూయింగ్ వర్తింపు..** గత ఐదేళ్లుగా రైతులు పడిన కష్టాలు మామూలు విషయం కాదు. ధాన్యం కొనుగోళ్ల నుంచి గిట్టుబాటు ధర వరకు అప్పట్లో మీ తరఫున పోరాటాలు చేశాం. టీడీపీ నేతలు కూడా రైతుల పక్షాన పర్యటనలు చేశారు. జనసేన పార్టీ తరఫున కౌలు రైతు భరోసా యాత్ర పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో ఏర్పాటు చేశాం. ఈ జిల్లాలో 42 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడాన్ని నమ్మలేకపోయాం. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులకు గౌరవం దక్కే ఏర్పాటు చేస్తాం. పండించిన పంటకు సకాలంలో చెల్లింపులు చేయాలన్న ఆలోచనను ఈ రోజు అమలు చేస్తున్నాం. రైతు భరోసా కేంద్రాలను రైతు సహాయ కేంద్రాలుగా మార్చాము. ఈ పంట ద్వారా సీసీఐసీ కార్డులు ఇచ్చే ఏర్పాటు చేసి కౌలు రైతులందర్నీ ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మమ్మల్ని నిలబెట్టిన రైతుల రుణం తీర్చుకుంటాం. గత ప్రభుత్వంలో దళారులు రైతు భరోసా కేంద్రాలను వారి స్వార్థానికి వాడుకున్నారు. రాష్ట్ర ప్రజల్లో ఇప్పటికీ 62 శాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. వ్యాపారవేత్తలతోపాటు రైతులకు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సౌకర్యం కల్పిస్తాం. రైతు సహాయక కేంద్రాలకు వెళ్తే సంతృప్తి కలిగే విధంగా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తాం. వచ్చే ఖరీఫ్ లో 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసే ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం పక్షాన మాటిస్తున్నాం. గత ప్రభుత్వం గోతాలు, ధాన్యం రవాణా విషయంలో రైతులకు అండగా నిలిచింది లేదు. కూటమి ప్రభుత్వంలో రైతులు దగ్గరలో ఉన్న మిల్లర్లకే ధాన్యం అమ్మే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులను కాపాడుకుంటాం. ఎక్కడా నష్టపరచం. పౌరసరఫరాల శాఖ రుణాలు రూ.40 వేల కోట్లలో వచ్చే మార్చి 31 నాటికి రూ. 10 వేల కోట్లు తిరగి బ్యాంకర్లకు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. శ్రీ పవన్ కళ్యాణ్ గారు, శ్రీ చంద్రబాబు నాయుడు గారు నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కష్టపడుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అద్భుతమైన వేర్ హౌస్ లు ఏర్పాటు చేస్తాం. ధాన్యం కొనుగోలు విషయంలో ఈ ప్రభుత్వం వెనకాడదు. ప్రతి గింజా కొనుగోలు చేసే విధంగ పని చేస్తాం. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంగా పని చేసి ఈ క్రాప్ ద్వారా నష్టపోయిన ప్రతి గింజకి పరిహారం అందే ఏర్పాటు చేస్తామని అన్నారు.

# ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చుతాం

- అమరావతి బ్రాండింగ్‌తో ఐపీఎల్ క్రికెట్ టీంను ప్రమోట్ చేస్తాం
- గల్లీ నుండి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం
- క్రీడామైదానాలు, స్టేడియంల ఏర్పాటుకు కృషి
- క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తాం
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు అనే తేడా లేకుండ విద్యార్థులకు ఒక గంట క్రీడలకు కేటాయించాల్సిందే
- సర్టిఫికెట్ల కుంభకోణంపై దృష్టి పెట్టి నిజమైన క్రీడాకారులకు పూర్తి న్యాయం చేస్తాం
- సీఎంతో మాట్లాడి అతి త్వరలోనే సరికొత్త క్రీడాపాలసీని రూపొందిస్తాము
- గత ఐదేళ్లలో క్రీడలకు అన్యాయం జరిగింది
- గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అంటూ అభాసుపాలు కార్యక్రమం నిర్వహించారు
- రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్ గా వచ్చే ఐదేళ్లలో తయారు చేస్తామని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, క్రీడాకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని రవాణా మరియు యువజన, క్రీడా శాఖామాత్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించిన అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందని, చివరలో ఆడుదాం ఆంధ్రా అంటూ అబాసుపాలు కార్యక్రమం నిర్వహించి, అందులో కూడా రూ. 120 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆధారాలను సేకరిస్తున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అమరావతి పేరుతో వచ్చే ఐదేళ్లలో ఐపీఎల్ క్రికెట్ జట్టును ప్రమోట్ చేయనున్నమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గల్లీ నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడల ప్రోత్సహకానికి కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి వారిలో క్రీడాసక్తి పెంపొందించి ఉత్తమ క్రీడాకారులుగా రాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా అవసరమైన క్రీడా మైదానాలు, స్టేడియంల నిర్మాణానికి పెద్దపీట వేస్తామన్నారు. క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ స్థాయిలో క్రీడల నిర్వహణ, ప్రోత్సాహంపై సీఎంతో చర్చిస్తామన్నారు. అలాగే క్రీడాకారులకు నకిలీ సర్టిఫికెట్ల వల్ల నష్టం జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందని, సర్టిఫికెట్ల కుంభకోణంపై విచారణ చేసి అసలైన క్రీడాకారులకు పూర్తి న్యాయం చేస్తామన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండ విద్యార్థులు ఆడుకోవడానికి ఒక గంట సమయం కేటాయించేలా టైం టేబుల్ ఏర్పాటు ఉండేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. అలాగే క్రీడామైదానాలు లేని ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు ఇస్తామని, అవసరమైతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం సాధించాలంటే క్రీడలు జీవితంలో భాగం కావాలన్న నినాదమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. క్రీడాపరంగా ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. దేశ బడ్జెట్‌లో క్రీడలకు ప్రాధాన్యత ఉంటుందని, సీఎం చంద్రబాబు సహకారంతో మన రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అధిక నిధులు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఏపీలో గోపిచంద్ వంటి మేటీ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు అకాడమి ఏర్పాటుకు తోడ్పాడు అందించడంతో దేశం గర్వించే క్రీడాకారులను తయారుచేయగలిగారని, అదేవిధంగా అమరావతి, వైజాగ్ లలో అకాడమి ఏర్పాటుకు చంద్రబాబు భూమి కేటాయిస్తే గత వైసీపీ ప్రభుత్వం దానిని తుంగలో తొక్కి క్రీడలకు అన్యాయం చేసిందన్నారు. కొత్త స్పోర్ట్స్ పాలసిపై సీఎం చంద్రబాబుతో చర్చించి త్వరలోనే విడుదల చేస్తామన్నారు.

రాష్ట్రంలో అనుమతి లేని క్రీడా అకాడమీల అనుమతులు రద్దు చేస్తామని అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నిర్వహణ కార్పొరేషన్ పరిధిలో ఉందని, దీంతో గత ప్రభుత్వం కేవలం రాజకీయ కార్యక్రమాలకు ఎక్కువగా ఉపయోగించిందని, శాప్ పరిధిలోకి వచ్చే విధంగా కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తామన్నారు. అలాగే పే అండ్ ప్లే జీవో వల్ల ఇబ్బందులుంటే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి రాంప్రసాద్ అన్నారు. సమావేశంలో శాప్ అధికారులు పాల్గొన్నారు.

# మతం పేరుతో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర



సూర్య ఉమ్మడి కరీంనగర్ ప్రతినిధి: మతం పేరుతో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు.సోమవారం కరీంనగర్ లో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనెహ్రూ అమలు చేసిన బానిసత్వ మరకలను తుడిచివేయాలి. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగం అందిస్తే... రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ అనేక పాపాలను యాడ్ చేసింది అని అన్నారు.మైనారిటీ సంతూష్టీకరణ విధానాలే దేశ అనిశ్చితికి కారణం అని ఉన్నారు. **అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందిస్తే... అందులో కాంగ్రెస్ అనేక పాపాలను జత చేసింది.** కాంగ్రెస్ చేసిన పాపాలను బీజేపీ కడిగే పని చేస్తే తప్పుపడతారా? అని ప్రశ్నించారు.వక్ఫ్ బోర్డు బిల్లుకు నెహ్రూ, పీవీ, మన్మోహన్ హయాంలో సవరిస్తే తప్పులేదట....ఆ తప్పులను సరిదిద్దేందుకు మోదీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తెస్తే తప్పుపడతారా? అని ఎద్దేవా చేశారు.

పంద్రాగస్టున జెండా, ఎజెండాను పక్కనపెట్టి మువ్వెన్నెల జెండాను ప్రతి ఇంటిపై ఎగరేయండి అని పిలువునిచ్చారు.జాతీయ జెండాను చేతపట్టని వాడు భారతీయుడే కాదు..జాతీయవాద భావజాలంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.నేటి నుండి పంద్రాగస్టుదాకా ప్రతి ఒక్కరి ఫోన్ వాట్సప్ లో మువ్వెన్నెల జెండాను డీపీలుగా పెట్టండి అని తెలిపారు.

# పేర్ల తప్పులతో కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదు

### టీపీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: సీఎం రేవంతడ్డి అమెరికా పర్యటనతో విదేశీ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ తెలిపారు. సోమవారం నాడు గాంధీభవన్లో జ్ఞాన సుందర్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంతడ్డి చెప్పినట్లుగా రైతులకు రుణమాఫీ చేస్తున్నారని తెలిపారు. పేర్లలో తప్పులతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని స్పష్టం చేశారు. ఆ లోపాలను సరిచేస్తున్నామని చెప్పారు. అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో సాగు, తాగు నీరుకు పుష్కలంగా నీళ్లు ఉన్నాయని అన్నారు. రేవంత్ ప్రభుత్వంలో వ్యసాయాన్ని పండగలా చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించే పనిలో ఉన్నారని వివరించారు. విజన్ ఉన్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని ప్రశంసించారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీ రాజ్కు నిధులివ్వలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం మానేసి, కాంగ్రెస్ సర్కార్కు సహకరించాలని కోరారు.



సీఎం రేవంత్ రెడ్డిని అడ్డుకోవడం బీఆర్ఎస్ నేతల వల్ల కాదని స్పష్టం చేశారు. మరో 20 ఏళ్లు రాజకీయాల్లో సీఎం రేవంత్ కీలకంగా ఉంటారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. మరోవైపు.. తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంతడ్డి పర్యటన కొనసాగుతుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అమెరికా పర్యటన ముగిసి దక్షిణ కొరియాకు సీఎం రేవంత్ బృందం వెళ్లిందని చెప్పారు. ఇప్పటివరకు రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకొచ్చాయని అన్నారు. ఐటీ, ఫార్మా, ఏఐ కంపెనీలతోపాటు మరిన్ని కంపెనీలు ఇన్వెస్ట్ చేయడానికి అగీకరించాయని చెప్పారు. 8 నెలల్లో రెండు సార్లు విదేశీ పర్యటనలు జరిగాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు అందరికీ తెలుసునని చెప్పారు. చెప్పినట్టుగా సీఎం రేవంత్ రైతు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. అయితే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ సర్కార్పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ విదేశీ పర్యటనపై కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము తప్పులు చేస్తే నిలదీయండి కానీ బురద జల్లవద్దని హితవు పలికారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పదేళ్లు కుటుంబ పాలన సాగిందని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు..

# యువత దేశానికి మార్గనిర్దేశకులుగా మారాలి

- రాష్ట్ర యువతీ యువకులకు శుభాకాంక్షలు
- రేపటి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ యువత సన్మార్గంలో పయనిస్తూ దేశానికి మార్గనిర్దేశకులు కావాలి
- అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి




తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర యువతీ యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. రేపటి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ యువత సన్మార్గంలో పయనిస్తూ దేశానికి మార్గనిర్దేశకులు కావాలని ఒక సందేశంలో ఆకాంక్షించారు. తెలంగాణ యువత రాణించేలా ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్యాచరణ తీసుకుందని సీఎం తెలిపారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, పెడదారులను నియంత్రిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమే అని ముఖ్యమంత్రి రేవంతడ్డి పేర్కొన్నారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంతడ్డి నేతృత్వంలోని బృందం చేపట్టిన విదేశీ పర్యటన విజయవంతంగా సాగుతోంది. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటన ముగించుకొని సౌత్ కొరియాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అడుగుపెట్టారు. పది రోజుల ప్రణాళికలో భాగంగా ఏడు రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. రేవంత్తో పాటు సౌత్ కొరియాకు మంత్రి శ్రీధర్ బాబు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి సైతం వెళ్లారు. అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసినట్లు రేవంత్ పేర్కొన్నారు. అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశామని రేవంత్ తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారీ అమెరికా కంపెనీలు ముందుకొచ్చాయని తెలిపారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

### అక్కడే జెండా ఎగురవేయనున్న సీఎం రేవంత్



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: తెలంగాణ ఆవిర్భావం నుంచి 2023 స్వాతంత్ర్య వేడుకల వరకు మాజీ సీఎం కేసీఆరే గోల్కొండపై జెండా ఎగురవేసేవారు. కాగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలిసారి జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభిస్తారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి సోమవారం పరిశీలించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే.. వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. కాగా.. ఈ స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఓ వైపు సీఎస్ ఆదేశాలతో అధికారులు పరుగులు పెడుతుంటే.. అదే స్థాయిలో గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జెండా వందనం చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు రానున్న నేపథ్యంలో అనేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ముందు నిర్వహించే పరేడ్కి సంబంధించి రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, ఈ పరేడ్ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

## సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్

# సోషల్ మీడియావి కారుకూతలే

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: రాష్ట్రాభివృద్ధ కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న రేవంత్పై సోషల్ మీడియాలో కారుకూతలు కూస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశారన్నారు. పెట్టబడులకు తెలంగాణను స్వర్గంగా మార్చుతున్నారని అన్నారు. రేవంత్ అమెరికా పర్యటన విజయవంతం కావడం బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. సూటు బూటు వేసుకొని దావోస్ వెళ్లిన కేటీఆర్ ఎన్ని కంపెనీలను తెలంగాణకు తెచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ ఏంవోయూ కుదుర్చుకున్న కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీలకు గత ప్రభుత్వం సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు. రేవంత్ సక్సెస్ తక్కువ చేసి చూపించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కష్టపడుతోందని వ్యాఖ్యలు చేశారు. బుర్రలేని వాళ్ళు కేటీఆర్ రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారన్నారు. అంగుళం భూమి కేటాయించకముందే మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తప్పులు చేసి తీహార్ జైల్లో ఎవరున్నారో ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ పదేండ్ల సూటు బూటు హడావిడికి రేవంత్ కేవలం 8 నెలల్లోనే సమాధానం చెప్పారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు, మరోవైపు ప్రైవేట్ ఉద్యోగాల కల్పన చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూడు సార్లు దావోస్ పోయి కంపెనీలు తెచ్చానన్న కేటీఆర్ దానిలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశీ పర్యటనల పేరుతో దుబాయి వెళ్లి సొంత బిల్డింగులు కొనుక్కున్న మీతో రేవంత్కుకి పోలికా? అంటూ మండిపడ్డారు. కేటీఆర్ ఇచ్చిన స్క్రిప్ట్ చదివి దిగజారవద్దని బీఆర్ఎస్ నేతలకు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే పనిచేస్తే వారి పని ఖతం అవుతుందని బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

సూర్య
విజయవాడ
మంగళవారం
13 ఆగస్ట్ 2024
4
సంపాదకీయం
editpage@suryaa.com

ఈ దేశానికి,యావత్తు ఈ ప్రపంచానికే తన కష్టార్జితంతో ఎలాంటి మోసాలకు పాల్పడకుండా,నీతి నిజాయితీలతో పట్టెడు అన్నం పెట్టే రైతన్న మన దృష్టిలో నిజమైన పోరాటయోధుడు,ఆత్మాభిమానం గలవాడు,ఎన్ని కష్ట నష్టాలూ,ఆటుపోట్లు ఎదురైనా దీటుగా ఎదుర్కొంటాడు కానీ దేహి అంటూ ఇతరుల ముందు చేయిచాచడు,తలవంచడు.చివరకు ఎటు పాలుపోని పరిస్థితుల్లో భూమి తల్లి తనకు భారమైనప్పుడు ప్రాణ త్యాగానికైనా సిద్దమే గాని అవమాన భారాన్ని మాత్రం ఎలాంటి పరిస్థితుల్లో సహించడు.ఒక విధంగా చెప్పాలంటే రైతు అనేవారు ఈ దేశానికి వెన్నెముక లాంటి వారు.రైతు లేనిదే ఏ రాజ్యం,ఏ దేశం మనుగడ సాగించలేదు.రైతు మంచి పాడి పంటలతో పది కాలాల పాటు సుభిక్షంగా ఉంటేనే ఏ దేశమైన,ఏ రాష్ట్రమైన సుఖ,సంతోషాలతో వర్ధిల్లుతుంది.అలా కాకుండా రైతుల జీవితాలు

## అన్నదాతలకు సుపరిపాలనను అందాలి

ఒక వేళ కష్టాల,నష్టాల ఊబిలో కూరుకుపోయి,వారు తీవ్ర దారిద్యాన్ని అనుభవిస్తే మాత్రం అది ఏ దేశానికైనా,ఏ రాష్ట్రానికైనా ఎనలేని అరిష్టమే.అలాగే మన దేశ వ్యాప్తంగా రైతు సోదరులు పండించే పచ్చని పంటలు అతివృష్టి, అనవృష్టిలా బారిన పడకుండా,వారి పంటలకు సరిఅయిన గిట్టుబాటు ధర లభించి వారు ధన, రాసులతో, అష్ట ఐశ్వర్యాలతో కలకాలం తలతూగుతేనే ఏ దేశమైన, ఏ రాష్ట్రమైన ఒక తారాజువ్వల సుదీర్ఘ కాలం అభివృద్ధి పథం లో శరవేగంగా దౌడు తీస్తుంది, దూసుకుపోతుంది అనే మాట ఎవరు కాదనలేని అక్షర సత్యం.కాబట్టి ఇప్పటికైనా మన పాలకులు రైతులు ఎదుర్కొంటున్న ప్రదాన సమస్యలు భారంగా మారిన ఎరువుల ధరలు,తమ పొలాలలో విత్తుకునే విత్తనాలు నాణ్యమైనవిగా లేకపోవడం, అదే మాదిరి తాను పండిస్తున్న పంటలకు వేసే మందులు కల్తీ గా ఉండటం, అలాగే తాను ఆరుగాలాలు రాత్రనక, పగలనక, ఎండనక, వాననక చెమటోర్చి పండించే పంటలకు దళారుల ఎనలేని స్వార్థం మూలాన గిట్టుబాటు ధర లభించకపోవడం ఇత్యాది సమస్యల పరిష్కారానికి ఏదైనా తరుణోపాయాన్ని మన పాలకులు ఆలోచించగలిగితే చావో,రేవో, కష్టమో, నష్టమో వ్యవసాయమే తమ వృత్తిగా చేసుకొని నిరంతరం తమ పొలాలతోనే తమ జీవనాన్ని కొనసాగించే మన రైతున్నల జీవితాలలో కొంతలో కొంతైనా నూతన వెలుగులు ప్రసరించడం,విరజిమ్మడం తథ్యం. ఏదిఏమైనా మన పాలకులు ఎలాంటి పరిస్థితి లో నైనా రైతుల జీవితాలు ఒక మెరుగైన స్థాయిలో ఉండేలా ఒక మంచి సుపరిపాలనను అన్నదాతలకు అందించాలి. ఎందుకంటే ముఖ్యంగా ఇప్పటికి మన దేశ జనాభా లో (60 % ) దాదాపు అరవై శాతం జనాభా వ్యవసాయరంగం పై ఆధారపడి జీవించేవారే.కాబట్టి రైతు శ్రేయస్సు, బాగుదలే ధ్యేయం గా మన దేశ,అయా రాష్ట్ర పాలకులు తమ ప్రభుత్వాలను ముందుకు నడిపించాలి. ఏమైనా ఏ దేశ,ఏ రాష్ట్ర పాలకులు అయినా అన్నదాత సుఖీభవః లాగా,వారి ఆకాంక్షలకు, వారి ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించాలి గాని ఎలాంటి పరిస్థితి లో నైనా అన్నదాత దుఃఖీభవ: లాగా,వారి ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన సాగించరాదు. జయ జయహో రైతు సోదరులు,వర్ధిల్లాలి రైతుబిడ్డల జీవితాలు నిండు నూరేళ్లు! జై కిసాన్

# రాష్ట్రపతిపాలన డిమాండ్ సమంజసమా?

- జగన్ పైశాచికత్వానికి పరాకాష్ట గా చెప్పాలి
- నేరపూరిత ఆలోచనా ధోరణికి ప్రబల నిదర్శనం
- నిత్యం నిరాధారమైన ఆరోపణల వల్లెవేత
- రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవాలనే దురాలోచనతో విమర్శలు
- హత్యలు జరిగాయంటున్న వాళ్లు వారి పేర్లు ఎందుకివ్వరు?



- సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి కనుక తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేయడం ఆయన నేరపూరిత ఆలోచనా ధోరణికి ప్రబల నిదర్శనం. నిరాధారమైన ఆరోపణలతో, రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవాలనే దురాలోచనతోనే జగన్ ఈ రకమైన విమర్శలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన 30 రోజుల్లో 36 మంది వైసీపీ నేతలు హత్యకావించబడ్డారని, ఢిల్లీ వెళ్లి ప్రచారం చేశారు. ఆ 36 మంది వ్యక్తుల పేర్లు, వివరాలు ఇవ్వమని అడిగితే సమాధానం లేదు. దీంతోనే, జగన్ ఆరోపణల్లో ఎంత పస ఉందో అర్థం అవుతుంది. గత 5 ఏళ్లల్లో జరిగిన వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేసి పరిపాలనను గాడిలో పెట్టి, శాంతిభద్రతలను కాపాడటం ద్వారా రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు, పరిశ్రమల్ని ఆకర్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎన్నడూ అధికారంలో ఉండి హింసా రాజకీయాలను ప్రోత్సహించలేదు. ప్రోత్సహించరు కూడా! అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని విచ్చలవిడిగా బరితెగింపుగా వ్యవహరించిన చరిత్ర వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిదే. "జై జగన్" అనలేదనే సాకుతో కత్తి చంద్రయ్య గొంతును కోసింది ఎవరు? రాష్ట్ర ప్రభుత్వం మాస్క్ లు సరఫరా చేయాలని కోరిన డాక్టర్ సుధాకర్ను నడిరోడ్డు మీద ఒంటిమీద బట్టలు ఊడదీయించి చిత్రహింసలకు గురిచేసి చివరకు చంపివేసిందెవరు? సుబ్రమణ్యం అనే దళిత యువకుడు, పేద కారు డ్రైవర్ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీపై జగన్ ఏం చర్యలు తీసుకొన్నారు? 5 ఏళ్లపాటు జగన్ పాలనలో గంజాయి ప్రభావంతో అన్ని చోట్లా రౌడీలు పుట్టుకొచ్చారు. వారికి ఆనాటి అధికార పార్టీ అండదండలు అందించి ప్రతిపక్ష తెలుగుదేశం నేతలపై దాడులు చేయించారు. సీనియర్ నేతలపై అక్రమ కేసులు బనాయించారు. నర్సాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణం రాజును స్వయంగా పోలీసుల చేత చిత్రహింసలకు గురి చేశారు. లి తమ ప్రభుత్వాన్ని విమర్శించారనే కారణంగా సోషల్ మీడియా నిర్వాహకుల్ని అక్రమంగా అరెస్ట్ చేశారు. కేవలం ఓ పోస్టు ఫార్వర్డ్ చేశారనే కారణంగా రంగనాయకమ్మ అనే మహిళను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్కు తరలించారు. చివరకు జర్నలిస్టును కూడా వదలకుండా వారినీ ఇబ్బందులకు గురి చేశారు. నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు, మంత్రులు తొడలు గొట్టి అంతుచూస్తామంటూ చేసిన హెచ్చరికలు ఇప్పటికీ



యూట్యూబ్లో ఉన్నాయి. వైఎస్ జగన్ చేసిన దుర్మార్గపు పరిపాలన వల్లనే ఆంధ్రప్రదేశ్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. అధికారం పోయిందిగానీ.. వైఎస్సాఆర్సీపీ నేతల దౌర్జన్యాలు ఆగడం లేదు. నేరస్థులకు, హంతకులకు కొమ్ముకాసే ప్రవృత్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే ఉందన్న వాస్తవం సొంత బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులోనే రుజువైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయి కనుకనే వైఎస్ జగన్ క్షేమంగా తాడేపల్లి ప్యాలెస్లో ఉండగలుగుతున్నారు. జగన్ తన మనుషుల్ని రెచ్చగొట్టి తెలుగుదేశం కార్యలయంపైకి పంపి విధ్వంసం సృష్టించినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు తన కార్యకర్తల్ని తాడేపల్లి ప్యాలెస్కు పంపే నీచ సంస్కృతికి దూరంగా ఉంటారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కోరడం జగన్ పైశాచికత్వానికి పరాకాష్ట. అధికారం పోవడంతో ఆయనకు మెంటల్గా బ్యాలెన్స్ తప్పినట్లుగా ఉంది. తక్షణం ఓ మంచి సైకియాట్రిస్టుకు చూపించుకొంటే మంచిదని హితవు చెబుతున్నాం.

# యువత ఒక దశ కాదు ఓ విప్లవానికి దిశ

- మొబైల్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 561కోట్లగా ఉంది
- ప్రపంచవ్యాప్తంగా డిజిటలైజేషన్
- సాంకేతికతను సమాజ సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగిస్తారు
- ఇక్కడ 39 శాతం మంది యువకులు ఇంటర్నెట్ను ఉపయోగం
- మొబైల్ పరికరాలు, సేవలు, కృత్రిమ మేధస్సు వంటి డిజిటల్ సాంకేతికతలు
- విధానాలను అభివృద్ధి చేయడానికి మెరుగైన సమన్వయ ప్రయత్నాలు అవసరం

జనక మోహన రావు దుంగ
8247045230

యువత రేపటి ప్రపంచానికి రూపశిల్పులు. సంకల్పం అభిరుచితో పర్వతాలనైనా కదిలించగలరు. యువత చేతిలో భవిష్యత్తు రూపొందించే శక్తి ఉంది. యువత యొక్క సామర్థ్యానికి అపరిమితమైన, అనంతమైన హద్దులు ఉండవు. ఒక దేశ పురోగతి, అభివృద్ధి ఆ దేశంలోని యువత సహకారంపై ఆధారపడి ఉంటుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితిలో యువత పాత్ర కీలకం. అందువల్ల యువత అభివృద్ధికి వారి జీవితాలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. యువత సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారాలు కనుగొనాలి. తద్వారా వారు సమాజం కోసం గొంతు పెంచగలరు.

**పెరుగుతున్న డిజిటల్ యువత:** ఐక్యరాజ్యసమితి వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్ డేటా ప్రకారం ప్రపంచంలో 808 కోట్ల జనాభా ఉంది. గత సంవత్సరం కంటే 7.4 కోట్లు పెరిగింది. ఇది యేడాదికి 0.9 శాతం వృద్ధికి సమానం. ప్రపంచ వ్యాప్తంగా 2024 ప్రారంభంలో మొబైల్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 561కోట్లగా ఉంది. జిఎస్ఎమ్ఎ ఇంటెలిజెన్స్ తాజా డేటా ప్రపంచ మొత్తం జనాభాలో 69.4 శాతం మొబైల్ ఉపయోగిస్తున్నారని, ఇది గత యేడాది కంటే 13.8 కోట్లు ఎక్కువని తెలిపింది. మొత్తం జనాభాలో 66 శాతం కంటే ఎక్కువ మంది ఇంటర్నెట్ని ఉపయోగిస్తున్నారు. తాజా డేటా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంఖ్య 535 కోట్లగా ఉంది. ఇంటర్నెట్ వినియోగదారులు గత 12 నెలల్లో 1.8 శాతం పెరిగారు. 2023 ప్రారంభం నుండి 9.7 కోట్ల కొత్త వినియోగదారులు చేరారు. కెపియోస్ విశ్లేషణ ప్రకారం క్రియాశీల సోషల్ మీడియా వినియోగదారుల 500 కోట్ల మార్కును అధిగమించారు. ఈ వినియోగదారు సంఖ్య ప్రపంచ జనాభాలో 62.3 శాతానికి సమానం.

**ప్రపంచాన్ని మార్చుతున్న డిజిటలైజేషన్:** ప్రపంచవ్యాప్తంగా డిజిటలైజేషన్ స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తోంది. మొబైల్ పరికరాలు, సేవలు, కృత్రిమ మేధస్సులాంటి డిజిటల్ సాంకేతికతలు ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (యస్డిజి)ను ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక, సామాజిక, పర్యావరణ పరిమాణాలలో తీవ్ర ప్రభావంతో డిజిటల్ టెక్నాలజీలు, డేటా అనేవి 169 యస్డిజి లక్ష్యాలలో కనీసం 70 శాతం లక్ష్యాన్ని చేరుకోడానికి దోహద పడతాయి. డిజిటల్ చేరికను పెంపొందించుకోవాల్సిన తక్షణ అవసరం ఉన్నప్పటికీ యువత ఎక్కువగా "డిజిటల్ స్థానికులు"గా గుర్తించబడుతోంది. డిజిటల్ స్థానికులు అంటే డిజిటల్ టెక్నాలజీ ఉనికితో లేదా సమాచార యుగంలో పెరిగిన వ్యక్తి అని అర్థం. వీరు సాంకేతికతను సమాజ సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా 2022లో 15 నుండి 24సం. వయస్సున్న వారిలో 75 శాతం మంది ఇంటర్నెట్ని ఉపయోగిస్తున్నారు. ఇది తరాల అంతరం తగ్గుతుందనే సంకేతాలుకు నిదర్శనం. 2020లో యువత (71 శాతం), మిగిలిన జనాభా (57 శాతం) మధ్య డిజిటల్ అందుబాటు రేటు మధ్య వ్యత్యాసం కేవలం14 శాతం పాయింట్లు మాత్రమే ఉండడం ఇక్కడ గమనించాల్సిన విషయం. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో ఈ వయస్సు ఉన్న వ్యక్తులు పెద్దవారు లేదా అంతకంటే తక్కువ వయస్సు గల వ్యక్తుల కంటే ఎక్కువగా కనెక్ట్ అయ్యారు. సాపేక్ష పరంగా అతిపెద్ద అంతరం తక్కువ ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో గమనించబడింది. ఇక్కడ 39 శాతం మంది యువకులు ఇంటర్నెట్ను ఉపయోగిస్తున్నారు. మిగిలిన జనాభాలో 23 శాతం మాత్రమే ఉన్నారు. ఇతర వయో వర్గాల కంటే ఎక్కువ రేటుతో డిజిటల్ స్వీకరణ, ఆవిష్కరణలలో యువత అగ్రగామిగా ఉన్నారు. అయినప్పటికీ అసమానతలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి తక్కువ ఆదాయ దేశాలలో యువతుల మధ్య మగవారితో పోలిస్తే తరచుగా ఇంటర్నెట్, డిజిటల్ నైపుణ్యాలకు తక్కువ అందుబాటులో ఉంది. యస్డిజి సాధన కోసం 2030 గడువు సమీపిస్తున్నందున ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి డిజిటల్ ఆవిష్కరణలో యువకుల పాత్ర చాలా అవసరం. మొబైల్ పరికరాలు, సేవలు, కృత్రిమ మేధస్సు వంటి డిజిటల్ సాంకేతికతలు సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తాయి. యువత కొత్త సాంకేతికతలను స్వీకరించడంలో, ఆవిష్కరింప జేయడంలో ముందంజలో ఉంటారు. ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ ట్రెండ్లను రూపొందించే వినియోగదారులుగా, డెవలపర్లగా అతిపెద్ద జనాభాను ఏర్పరుస్తారు. మొబైల్ పరికరాలు, డిజిటల్ ప్లాట్ఫారమ్లు, కృత్రిమ మేధస్సు లాంటి సాంకేతికతలు ప్రపంచ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి డిజిటల్ ఇంటరాక్షన్ నుండి రూపొందించబడిన డేటా డిజిటల్ పరివర్తనకు ప్రాథమికమైనది. ఇది 169 యస్డిజి లక్ష్యాలలో కనీసం 70%కి దోహదపడుతుంది. డిజిటల్ పరివర్తన అనేది యస్డిజి సాధించడానికి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. డిజిటల్ పరివర్తన అనేది వ్యాపారం యొక్క అన్ని రంగాలలో డిజిటల్ సాంకేతికతను ఏకీకృతం చేయడం. వ్యాపారాన్ని ఎలా ఆపరేట్ చేయాలి, కస్టమర్లకు విలువైన సేవలు అందించడం అనేది ఇందులో ప్రాథమిక అంశం. డిజిటల్ పరివర్తన సాధనాలు ఉత్పాదకత, రాబడి, సామర్థ్యం, కస్టమర్ అనుభవంతో పాటు వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడానికి సహాయపడే సాఫ్ట్వేర్ సాంకేతికతలు. యస్డిజి లక్ష్య సాధన గడువు 2030 సం. సమీపిస్తున్నందున ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సాంకేతిక పరివర్తన శక్తిని పెంచడంలో



యువత ముఖ్యపాత్ర వహించాలి.

**సవాళ్ల పరిష్కారాలు:** రాజకీయ సంక్షోభం, ఆర్థిక మందగమనం, పెరుగుతున్న అసమానతలు, అధ్వాన్నంగా పర్యావరణ సంక్షోభం లాంటివి ప్రపంచంలో 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో అడ్డంకులుగా ఉంటాయి. పెరుగుతున్న సంఘర్షణలతో కూడిన వాతావరణ మార్పుల యొక్క పెరుగుతున్న ప్రభావాలు, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో పురోగతిని తిప్పికొట్టగల భయంకరమైన పోకడలకు దోహదం చేస్తున్నాయి. ఆశ్చర్యకరంగా 72 దేశాలలో 30.9 కోట్ల మంది ప్రజలు దీర్ఘకాలిక ఆకలిని ఎదుర్కొంటున్నారు. 220 కోట్ల మందికి సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. మే 2024లో బలవంతపు స్థానభ్రంశం 120 మిలియన్లకు పెరిగిందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పేదరికాన్ని నిర్మూలించడానికి, ఆకలిని అంతం చేయడానికి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, శాంతియుత, సమ్మిళిత సమాజాలను ప్రోత్సహించడానికి, ప్రపంచ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఇప్పుడు చర్య తీసుకోవాలి. సంఘర్షణలు, వాతావరణ మార్పుల నుండి పేదరికం, ఆకలికి అత్యంత తీవ్రమైన అంతరాయాలను నివారించడానికి గతంలో కంటే ఇప్పుడు వేగవంతమైన చర్య అవసరం. పరస్పర సంఘీభావం అంతర్జాతీయ సహకారానికి మన నిబద్ధతన పునరుద్ధరించుకోవాలి. ఈ సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన స్థిరమైన భవిష్యత్తు యొక్క వాగ్దానాన్ని అందించే విధానాలను అభివృద్ధి చేయడానికి మెరుగైన సమన్వయ ప్రయత్నాలు అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలు హరిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడానికి, పెరుగుతున్న వాతావరణ ప్రభావాల నుండి జీవితాలను, జీవనోపాధిని రక్షించడానికి అవసరమైన మద్దతును పొందాలి. ఈ సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను కనుగొనడానికి ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం, పౌర సమాజం కలిసి పనిచేయాలి. డెవలప్మెంట్ ఫైనాన్సింగ్ గ్యాప్ను పూడ్చేందుకు పెద్ద ఎత్తున ఫైనాన్సింగ్ను సమీకరించడానికి తక్షణ చర్యలు అవసరం. ఇప్పుడు సంవత్సరానికి 4.2 లక్షల కోట్ల డాలర్లు అవసరమని అంచనా వేయబడింది. స్థిరమైన అభివృద్ధి కోసం అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల ఆర్థిక కట్టుబాట్లను తప్పక నెరవేర్చాలి. యస్డిజి సాధించడానికి ఇన్నోవేటివ్ ఫైనాన్సింగ్ మెకానిజమ్స్ కూడా కీలకం. వీటికి యువత డిజిటల్ మార్గాలు ద్వారా పరిష్కరించాలి.

# అన్యాయపు శిక్ష

ఏడా దిన్నర కాలంగా మద్యం విధానం పై కేసులో జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ ఉపముఖ్య మంత్రి సిసోడియాకు సుప్రీం బెయిల్ మంజూరు చేసి ఊరట నిచ్చింది. ఆ కేసు విచారణకు సీబీఐ ఇంకా సిద్ధంకాలేదు. దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలమంతా ఆయన బెయిల్ కోసం క్రింది కోర్టులకు ఎక్కి దిగి వస్తున్నారు. సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు లక్షల పేజీలతో సిద్ధపడుతూ, బెయిల్ ని వ్యతిరేకిస్తూ రావడం వల్ల, విచారణ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని చెప్పడం వల్ల ఆయనకు బెయిల్ ద్వారా స్వేచ్ఛ లభించలేదు. ఈ విషయాల్ని గమనించి సుప్రీం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. క్రింది కోర్టులు రక్షణాత్మక వైఖరి తో సేఫ్ గేమ్ ఆడుతూ, బెయిల్ ఇవ్వకుండా ఆయన స్వేచ్ఛ హక్కుని కాలరాయడాన్ని తప్పు పట్టింది. ఎందుకంటే న్యాయ సూత్రాల ప్రకారం బెయిల్ అన్నది నిందితుడి సహజ హక్కు, జైలు తప్పని సరి సమయాల్లోనే అవసరం. ఆ వ్యక్తి ద్వారా సాక్ష్యాలు ప్రభావితం అవుతాయను కుంటేనో, లేదా ఆయన దేశం విడిచి పారిపోతాడనుకుంటేనో జైల్లో ఉంచడం అవసరం. దర్యాప్తు సంస్థలు అన్ని పత్రాల్నీ సేకరించి పెట్టుకున్నపుడు,వాటి పైనే కేసు ఆధారపడి ఉన్నప్పుడు ఆయనకి కేసు ను ప్రభావితం చేసే అవకాశం లేదన్నది క్రింది కోర్టులు గమనించాల్సింది. విచారణ ప్రక్రియ మొదలవ్వడమే తీవ్రంగా జాప్యం కావడం, అంత వరకూ నిందితుడు జైల్లోనే మగ్గాల్సి రావడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. తప్పు చేశాడని ఋజువు కాకముందే శిక్షించడం అన్యాయం. ఒకవేళ ఆయన నిరపరాధి అయితే, చేయని నేరానికి, శిక్ష అనుభవించాల్సిరావడం ఎంత వేదనా భరితం? దర్యాప్తు సంస్థల నిష్పక్ష పాత ధోరణి పై, అధికార పీఠాల తో వాటి దగ్గరతనంపై అనుమానాలున్నప్పుడు న్యాయప్రక్రియ మరింత లోపరహితంగా ఉండాలి. నిందితుడి వైపు నుండి ముందు ఆలోచించాలి.అయితే ఇలా విచారణ ఖైదీలకు న్యాయ వ్యవస్థ అనుమతించిన బెయిల్ హక్కు దూరం కావడం అరుదైన విషయం కాదు. జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం గత సంవత్సరం జైళ్లల్లో మగ్గుతున్న విచారణ ఖైదీలు నాలుగు లక్షల ముప్పయి వేల మంది. పూచీకత్తు లకు ధనంలేక, సహాయం లేక ముద్దాయిలుగా ముద్ర పడక ముందే, ఆ నేరానికి తమకు పడగల శిక్షకన్నా ఎక్కువ శిక్షకు గురై ఉన్నారు. సమాజంలో పలుకుబడి, అధికారం ఉన్న సిసోడియా లాంటి వారికే, అదీ అన్ని వనరులతో పోరాడితేనే, అందాల్సిన న్యాయం ఏడాదిన్నరకి అందితే, ఇక ఏ దిక్కూ లేని వారి సంగతేమిటి? ఆ లక్షలాది మంది కి కూడా న్యాయం దక్కేలా వ్యవస్థను సరిదిద్దుకోవాలి. లేదంటే అది ఒక సామాజిక వైఫల్యంలా, భారతీయ న్యాయ వ్యవస్థ కే మచ్చలా మిగిలి పోతుంది.

డా. డి వి. జి. శంకర రావు, మాజీ ఎంపీ,పార్వతీపురం 944083691

# నాయకులు ఎప్పుడు ప్రజలకు ఋణగ్రస్తులే

ఈరోజు మీరు అనుభవించే పదవులు, మంది మార్బలాలు శాశ్వతం కాదు, వాటిని అడ్డంపెట్టుకొని, మీ అబ్బ సొత్తుగా భావించి సామాన్య, పేద ప్రజానీకం పై ఆరాచకాలు చేస్తే,అయిన దానికి కానిదానికి వేధింపులకు గురిచేస్తే మాత్రం మీరు ప్రజల దృష్టిలో ఒక దౌర్జన్యకారులుగా,అప్రజాస్వామిక శక్తులుగా,అభివృద్ధి నిరోధకులుగా మిగిలిపోతారు అనేది ఎవరు కాదనలేని అక్షర సత్యం కూడా.అంతేకాకుండా ఈరోజు మీ దగ్గర తిష్ట వేసుకొని కూర్చున్న అధికారం రేపు మీ దగ్గర వుండకపోవొచ్చు,అధికారం లేనప్పుడు మీ ఇళ్ల ప్రాంగణం ఏ మాత్రం హంగు,ఆర్భాటాలు అనేవి లేకుండా అంతా నిర్మానుష్యంగా మారిపోతుంది.కాబట్టి అలాంటి దయనీయమైన పరిస్థితి మీకు రాకుండా ఉండాలంటే, ప్రజల ఆధారాభిమానాలు ఎల్లవేళలా లభించాలి అంటే మీరు పదవిలో వున్నప్పుడే న్యాయ బద్ధమైన పాలన ప్రజలకు అందిస్తే రేపు మీరు పదవిలో లేనప్పుడు కూడా వారు మిమ్మల్ని ఎంతో గౌరవిస్తారు, వారి సమస్యలు ఏకరువు పెట్టడానికి మీ ఇంటికి, పార్టీ ఆఫీసులకు వస్తారు అని గుర్తించుకోండి.ఎందుకంటే ఈ ప్రజాస్వామ్యం లో ప్రజలే దేవుళ్ళు, ఎందుకంటే వారే కదా తమ అమూల్యమైన ఓట్లను మీకు వేసి గెలిపించేది,ఆఖండ మెజారిటీ కట్టబెట్టేది,మీకు అధికారం అనే సింహాసనాన్ని అధిరోహించేలా చేసేది.కాబట్టి నాయకులు అనే వారు ప్రజలకు ఎప్పుడు రుణగ్రస్తుల లాంటి వారే, ఎలాగంటే వారి రుణాన్ని నాయకులు ఎప్పటికి,ఎన్నటికీ ఏనాడు తీర్చుకోలేరు కూడా.అందుకే ఎల్లవేళలా ప్రజల పట్ల మీరు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి,వారి పట్ల గౌరవప్రదంగా ఉండాలి.అప్పుడే ప్రజలు మెచ్చిన, జనాకర్షణ మెండుగా వున్న నాయకులుగా ఒక మెట్టు పైకి ఎదుగుతారు.అలా కాకుండా ఎదో గెలిచితి నమ్మాఅధికారంలోకి వచ్చితినమ్మా,వెళ్ళిపోతినమ్మా అనే స్వార్థపూరితమైన పంథా లో కాకుండా ప్రజా సమస్యల పట్ల అత్యంత చిత్తశుద్ధి తో వ్యవహారిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తమ శక్తివంచన లేకుండా ఆవిరళకృషి సల్పితే మాత్రం ప్రజల దృష్టిలో మీరు ఒక ఆరాధ్యనీయమైన నాయకులుగా అత్యంత సుదీర్ఘ కాలం పాటు మీరు ఒక వెలుగు వెలగడం తథ్యం. ఏదిఏమైనా నాయకులు మీరు సాధ్యమైనంత వరకు ప్రజలకు మంచి చేసేందుకు ప్రయత్నించండి,ఒక వేళ మంచి చేయకున్నా పర్వాలేదు,చెడు మాత్రం ఎటువంటి పరిస్థితుల్లో చేయకండి. ఎందుకంటే ప్రజలు ఎంతో నమ్మకంతో మిమ్మల్ని ఓట్లు వేసి గెలిపించింది వారిని ఉద్దరించడానికి,వారిని పీడించుకొని తినడానికి కాదు అని గుర్తుంచుకోండి. రాజకీయనాయకులు అంటే పేద, సామాన్యప్రజానీకం పాలిట పెన్నిధిగా నిలవాలిగాని,వారిపాలిట శాపంగా ఎన్నటికీ మారకూడదు.ఏమైనా మీరు మీ స్వార్థ వైఖరిని కాస్త విడనాడి నిస్వార్థ వైఖరికి పట్టం కట్టి ప్రజల పట్ల తలలో నాలుక లాగా వ్యవహారిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడితే మాత్రం నాయకులు మీకు ఇక ప్రజలు బ్రహ్మరథం పట్టడం,నీరాజనాలు పలుకడం తథ్యం.భారతమాతాకీ జై! పేద, సామాన్యప్రజానీకం మరో పది కాలాల పాటు అత్యంత దిగ్విజయంగా వర్ధిల్లాలి! ప్రజాసేవలో నిత్యం తరించే నాయకులు మరింతమంది పుట్టుకురావాలి!పేద, సామాన్య ప్రజల బ్రతుకులు మారాలి, వారంతా తిండికి,బట్టకు,గూడుకు ఏ మాత్రం లోటు లేకుండా అత్యంత సుఖ, సంతోషాలతో జీవించాలి! జై హింద్! జై భారత్!



- బుగ్గన మధుసూదనరెడ్డి,(9000369660)

# రెక్కలు తెగిన బాల్యం ...?

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా అయిదా రేడుల పాపల్లారా! మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మీకే అని ఆనందించే కూనల్లారా! మీదే, మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్యవిధాతలు ! ఉడుతల్లారా ! బుడుతల్లారా ! ఇది నా గీతం వింటారా ? అంటూ కల్మష మెరుగని బాల్యానికి అక్షరాల ఆకారం ఇచ్చాడు మహాకవి శ్రీశ్రీ. ప్రతీ మనిషి జీవితంలో రంగుల కలబోత "బాల్యమే". మలినం లేని చలనం వారి స్వంతం బుడిబుడి అడుగులు, బోసి నవ్వులు ఎంతటి పాషాణ హృదయులనైన యిట్టే కరిగిస్తాయి. ఈ మధ్యకాలంలో వచ్చిన రెండు పాన్ ఇండియా నిమాలలో (యానిమల్, సలార్) "బాల్యం" నేపథ్యంతోనే సినిమాలో ప్రధానంగా చూయించటం జరిగింది. తండ్రిని అమితంగా ఇష్టపడే కుర్రాడికి, ఆ తండ్రి వ్యాపార పనులలో పడి అశ్రద్ధ చేస్తాడు, రోజు ఇంటికి ఏ రాత్రి వేళల్లోనో రావటం అప్పటికే పిల్లలు గాఢ నిద్రలో వుండటం, పిల్లలు లేచే సమయానికే తిరిగి మళ్ళీ వ్యాపార పనుల నిమిత్తం బయటికి వెళ్ళటం ప్రతిరోజు జరుగుతుంది. ఈ క్రమంలో తండ్రి పెద్ద వ్యాపార సామ్రాజ్యం నిర్మిస్తాడు, దానికి సమాంతరంగా బాలుడు పెరిగి పెద్దవాడవుతాడు నాటకీయంగా తండ్రి ఎదుగుదలను తట్టుకోలేని వారి బంధువులు "హీరో" ఐన బాలుడి తండ్రిని చంపి ఆస్తి కాజేయాలని చూడటం, అల్లుడు కూడా స్వంత మామను చంపాలని కుట్రలు చేయటం మొదలైన విషయాలన్నీ హీరోకి తెలుస్తాయి. ఈ క్రమంలో స్వంత బావను చంపటం, తన తండ్రికి వున్న శత్రువులను గుర్తిస్తు ఒక్కొక్కరిని చంపుతూ చివరికి "ఉన్మాదిలా" మారతాడు, కథ చివరలో తన కుమారుడు తన కోసమే ఇలా మారాడని తండ్రి గ్రహిస్తాడు. ఈ కథ ద్వారా మనం తెల్సుకోవాల్సిందేమంటే ఆ పిల్ల వాడికి బాల్యంలో తండ్రి నుండి దక్కాల్సిన "ప్రేమ" దొరికితే "యానిమల్" (జంతువు) లాగా మారకుండా ఉండేవాడు కాదేమో అన్నది ప్రశ్న. అది కథ దానికి కొంత నాటకీయతను జోడించి మొత్తానికి "బ్లాక్ బస్టర్" జాబితాలోకి నెట్టేశాడు ఆ సినిమా దర్శకుడు. ఇక మరో సినిమా "సలార్" ఈ సినిమాలో హీరో తల్లి (ఈశ్వరీరావు) హీరో బాల్యంలో జరిగిన ఓ సంఘటనతో ఆ ప్రాంతం నుండి చిన్న పిల్ల వాడిని తీసుకొని దూరంగా వెళ్ళి ఓ ప్రాంతంలో చిన్న పిల్లలకు పాఠాలు చెబుతూ గడుపుతుంది. కొడుకు ప్రభాస్ (పాత్ర పేరు దేవా) ఇంటికి ఆలస్యంగా వచ్చినా భయపడుతుంది. అతని చేతిలో చిన్న "ఆయుధం" కనిపించినా భయపడుతుంది. తన తల్లి అలా మారటానికి గతంలో జరిగిన సంఘటనలు పిల్లవాడిపై ప్రభావం చూయించకుండా దూరంగా వెళ్తుంది కానీ హీరో మళ్ళీ హింసాత్మక సంఘటనల వైపు మళ్ళీ తెర మీద "బీభత్సాన్ని" సృష్టిస్తాడు. ఇందులో కూడా "బాల్యమే" అంతర్లీనంగా ప్రభావం చూపుతుంది అనేలా దర్శకుడు కథకు మసాలా జోడించి విజయం సాధించాడు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చిన్న పిల్లలపై జరుగుతున్న కొన్ని సంఘటనలు చూద్దాం 24 %-% ఫిబ్రవరి 2022న రష్యా ఉక్రెయిన్ పై దాడి చేసింది, ఫలితంగా రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైంది. ఉక్రెయిన్ కి అండగా అగ్రరాజ్యం అమెరికా వెన్నుదన్నుగా వుండి ఆయుధాలు సరఫరా చేస్తు కపట నాటకం ప్రదర్శిస్తు ఓ వైపు శాంతి మంత్రం జపిస్తు మరోపక్క యుద్ధాన్ని ప్రోత్సహించడం మూలంగా లక్షలాది మంది నిరాశ్రయులైన పొరుగు దేశాలకు వలస వెళ్ళటం, వేలమంది చనిపోవటం మనకు తెలిసిన విషయమే. ఇక ఉక్రెయిన్ నగరం దాదాపుగా ధ్వంసమైపోయింది, లక్షల మంది చిన్నారులు పొరుగు దేశాల్లో వలస జీవుల మాదిరిగా జీవించాల్సిన పరిస్థితి. యుద్ధం చేస్తున్న రెండు దేశాలు యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా మరియు యూరోపియన్ దేశాలు చిన్నారుల భవిష్యత్ గూర్చి ఆలోచించకపోవటం బాధ కల్గించే అంశం. మరొక అంశం ఇజ్రాయిల్, పాలస్తీనా, (హమాస్) దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం ఇది 7 అక్టోబర్ 2023 న ప్రారంభమై చిలికి చిలికి గాలివానగా మొదలై ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశంగా మారింది. అక్కడ జరుగుతున్న నరమేధం పట్ల యావత్ ప్రపంచం సానుభూతిని వ్యక్తం చేస్తోంది. ఈ పది నెలల కాలంలోనే సుమారు నలభై వేలమంది చనిపోవటం, ఇందులో చిన్న పిల్లలే మూడువంతులుకు పైగా వున్నారంటే యుద్ధాల వల్ల నష్టపోయేది ఎవరనేది ఈ పాటికే అర్థం చేసుకోవచ్చును. "గాజాలో" పిల్లలు ఆహారం దొరక్క గడ్డితిని, బురద మన్నును తింటూ గడుపుతున్న దృశ్యాలు తోటి మానవ జాతికి సిగ్గుచేటు. ఈ రెండు దేశాల మధ్య జరుగుతున్న నరమేదాన్ని ప్రపంచ దేశాలు ఆపటానికి ప్రయత్నించకపోవటం, ఐక్యరాజ్య సమితి కూడా చేష్టలు డిగి చేతులెత్తేయ్యటం ఫలితంగా దాని మనుగడే ప్రశ్నార్థకం అయినది. కక్షతో కానీది కక్షతో సాధించనిది క్షమాబిక్షతో సాధించాలి, కత్తితో చేధించనిది కరుణతో చేదించాలి అంటాడు. జ్ఞాన్ పీట్ అవార్డు గ్రహీత.

డాక్టర్ మహ్మద్ హసన్ 9908059234.

## దొంగస్వామి ఆక్రమణ భూమిలో ఎమ్మెల్యే పూజలా

కొట్లాదిరూపాయల విలువగలిగిన గుడ్లూరుమండలం చేవూరు చెరువుపోరంబోకును , ఆటవీభూమిని ఒకదొంగస్వామి ఆక్రమించి , ఆశ్రమం పేరుతొ మోసం చేస్తుంటే , ప్రిన్సిపల్ సెక్రటరి (రెవిన్యూ )వారు 2021 ఎప్రిల్ నెలలో ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకొవాలని ఆదేశించింది . దాన్ని అమలుపరచవలసినభాద్యత అధికారులపై ఉంది. అమలుపరచకపోతే అనియోజకవర్గ శాసన సభ్యుడు అధికారులను ఎప్పుడు అమలుపరిస్తారని హెచ్చరించాలి . ఈమధ్య కందుకూరి శాసనసభ్యుడిని హేతువాదసంఘం సభ్యులుకలసి ఈదేవిషయమై డిమాండు చెయ్యటం కూడా జరిగింది . అలాంటప్పుడు ఒకభాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి , దొంగస్వామి అక్రమణభూమిలోకి వెళ్లి పూజలుజరపటం ఎమిటి ? ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ , దొంగస్వామి ఆక్రమణకు శాసనసభ్యుడు మద్దతు పలుకుతున్నాడా !! మద్దతుపలికితే శాసనసభ్యుడిగా రాజీనామా చేసిఆపనిచేస్తేబాగుంటుంది. ఇలాచేయటం చాలా సిగ్గుచేటైన విషయం . శాసనభ్యుడు దొంగలను సపోర్టు చెయ్యకూడదు. దొంగలనుపట్టుకొని జైల్లోపెట్టాలి. మాజీ శాసనభ్యుడు మహీధరరెడ్డి ఈదొంగస్వామి కి వ్యతిరేకంగా చాలా కృషిచేశాడు. ఏనాడూ ఆశ్రమానికివెళ్ళి పూజలుచెయ్యలేదు. కనుక ఇప్పటికయినా కందుకూరి శాసనభ్యుడు ప్రిన్సిపల్ సెక్రటరి అదేశాలు అమలుపరచేవిదంగా , దొంగస్వామిని అక్కడనుండి తరిమేసి , ఆక్రమణ భూమిని స్వాధీనము చేసుకోనేచర్యలు చెప్పట్టాలని హేతువాద సంఘం డిమాండుచేస్తుంది.

సొర్నెవెంకటసుబ్బయ్య ,9290617819

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గాని సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

సూర్య
విజయవాడ
మంగళవారం
13 ఆగస్టు 2024


## మోడీపై కాంగ్రెస్ నేత ప్రశంసల వర్షం

ఢిల్లీ: మోడీ సర్కార్ పై కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత శశిథరూర్ సంచలన కామెంట్స్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి, విపక్ష కాంగ్రెస్కు మధ్య ప్రస్తుతం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి నెలకొన్న తరుణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనాకు భారత ప్రభుత్వం ఆశ్రయం ఇవ్వడాన్ని శశి థరూర్ ప్రశంసించారు. భారత్ 1971లోనూ బంగ్లాదేశ్ ప్రజలతో ఉందని.. ఎప్పటికీ ఉంటుందని అన్నారు. 'షేక్ హసీనాకు మనం సాయం చేసి ఉండకపోతే అది దేశానికే అవమానకరంగా మారేదని అభిప్రాయపడ్డారు. పొరుగుదేశంలో అధికార మార్పు భారత్ను ఆందోళనకు గురిచేసే అంశం కాదన్నారు. "ఆమెకు మనం సాయం చేయకపోతే.. అది భారత్కు అవమానం. భవిష్యత్తులో ఎవరూ మనకు మిత్రులుగా ఉండేందుకు ఇష్టపడేవారు కాదు. మీ మిత్రులు సమస్యల్లో ఉంటే ఎప్పుడే సాయం చేయడానికి తటపటాయించకూడదు. కచ్చితంగా వారిని సురక్షితంగా ఉంచేలా చూడాలి. ఇప్పుడు భారత్ కూడా చేసింది అదే. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. అంతకు మించి నేనేమీ కోరుకోవడం లేదు. ఒక భారతీయుడిగా మనం ప్రపంచం కోసం నిలబడే విషయంలో కొన్ని ప్రమాణాలున్నాయి. ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి రక్షణ కల్పించి ప్రభుత్వం సరైన పనే చేసింది" అని థరూర్ పేర్కొన్నారు. "ఆమె ఇక్కడ ఎన్నాళ్లు ఉంటారన్నది మనకు అనవసరం. మనం ఎవరినైనా ఇంటికి ఆహ్వానించిన తర్వాత ఎప్పుడు వెళ్లిపోతారు అని అడగం. ఆమె ఇక్కడ ఎన్నాళ్లు ఉండాలనుకుంటే అన్నాళ్లు మనం వేచి చూసే వైఖరి పాటించాలని భావిస్తున్నాను" అని శశిథరూర్ అభిప్రాయపడ్డారు.



# ప్రధానిగా మోడీ మరో రికార్డు

● ఎర్రకోటపై నుంచి వరుసగా 11వ సారి.. ● నెహ్రూ, ఇందిరల సరసన మోడీ ● సరాసరి 82 నిమిషాలు ప్రసంగం ● యూపీఏ హయాంలో మన్మోహన్ 10సార్లు


ఢిల్లీ: భారత ప్రధానిగా ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ చరిత్ర సృష్టించనున్నారు. వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రికార్డును ప్రధాని మోడీ ఇప్పటికే సమం చేశారు. అంతేకాదు.. వరుసగా 11 సార్లు ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. జాతినుద్దేశించి ప్రసంగించిన మూడో ప్రధానిగా చరిత్రలో నిలిచిపోనున్నారు.

**ఆ ఇద్దరి తర్వాత మోడీ..**

ఇప్పటి వరకు వరుసగా 11 సార్లు ఎర్రకోటపై నుంచి ప్రసంగించిన ప్రధానుల్లో జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ఉన్నారు. గురువారం జరగనున్న భారత స్వాతంత్ర్య వేడుకలకు దేశ రాజధానిలోని ఎర్రకోట ముస్తాబవుతుంది. ఆ రోజు ప్రధాని నరేంద్ర మోడీ.. ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. దీంతో వారి సరసన ప్రధానిగా మోడీ చేరనున్నారు. భారత తొలి ప్రధానిగా జవహర్లాల్ నెహ్రూ వరుసగా 17 సార్లు ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. అలాగే ఆయన కుమార్తె, ఇందిరాగాంధీ మొత్తం 16 సార్లు ఎర్రకోటపై నుంచి ప్రధానిగా జాతినుద్దేశించి మాట్లాడారు. 1966 జనవరి నుంచి 1977 మార్చి వరకు వరుసగా 11 సార్లు ఆమె ఎర్రకోటపై నుంచి ప్రధానిగా ప్రసంగించారు. అలాగే 1980 జనవరి నుంచి 1984 అక్టోబర్ వరకు ప్రధానిగా మరోమారు అదే ఎర్రకోటపై నుంచి ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు.

**ప్రధానిగా మన్మోహన్ సింగ్..**

యూపీఏ హయాంలో ప్రధానిగా మనోహ్మాన్ సింగ్ పని చేశారు. ఆయన సైతం వరుసగా 10 సార్లు మాత్రమే ఆగస్ట్ 15వ తేదీన ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. దీంతో ప్రధానిగా తొలిసారి నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది ఆగస్ట్ 15వ తేదీన ఎర్రకోటపై నుంచి ప్రధానిగా ఆయన జాతినుద్దేశించి తొలిసారిగా ప్రసంగించారు. ఈ ప్రసంగంలోనే స్వచ్ఛ్ భారత్తోపాటు జనధన్ యోజన ఖాతాలను ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోడీ కీలక ప్రకటన చేసిన విషయం విధితమే. ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. ప్రధాని మోదీ ప్రసంగ పాఠం సరాసరి 82 నిమిషాలుగా ఉంది. 2017లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రసంగం పాఠం కేవలం 55 నిమిషాలు మాత్రమే ఉండగా.. 2016లో ఆయన ప్రసంగ పాఠం మొత్తం 94 నిమిషాలుగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వేళ.. అంటే 1947లో ప్రధానిగా నెహ్రూ కేవలం 24 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇక 1972లో ప్రధాని ఇందిరా గాంధీ 54 నిమిషాలు ప్రసంగించారు.





# పోలీసులకు సీఎం మమత డెడ్ లైన్

● వారం రోజుల్లో కేసు ఛేదించకపోతే.. కేసు సీబీఐకి అప్పగిస్తా: సీఎం మమత ● ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరగాలని కోరుకుంటున్నాం ● విద్యార్థులు కోరుకుంటే సీబీఐకి అప్పగించేందుకు రెడీ: సీఎం

కోల్కతా: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేస్తోంది. నిందితుడికి కఠినంగా శిక్ష పడాలంటూ వైద్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి మమ తా బెనర్జీ పోలీసులకు అల్టిమేటం ఇచ్చారు. వారం రోజుల్లో కేసును పరిష్కరిం చలేకపోతే సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ పోలీసులు దీదీ ఈ డెడ్లైన్ విధించారు. సీఎం మమతా బెనర్జీ సోమవారం మృతురాలి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ బీకులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "ఈ కేసులో మరింతమంది నిందితులు ఉన్నట్లయితే వారందరినీ ఆదివారం లోగా అరెస్టు చేస్తాం. ఒకవేళ అప్పటిలోగా రాష్ట్ర పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. ఈ కేసుపై ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరగాలని మేం కోరుకుంటున్నాం" అని దీదీ వెల్లడించారు. ఇదే సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థపై విమర్శలు గుప్పించారు. "సీబీఐ విజయాల రేటు చాలా తక్కువగా ఉంది. చోరీకి గురైన రబీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ బహుమతి కేసును వాళ్లు ఇంకా పరిష్కరించలేదు" అని మమత దుయ్యబట్టారు. విద్యార్థులు కోరుకుంటే ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గతవారం కూడా సీఎం చెప్పిన సంగతి తెలిసిందే.

**అవమానాలు భరించలేను..ప్రిన్సిపల్ రాజీనామా**

మరోవైపు, కోల్కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ దీనిపై మాట్లాడారు. "ఒకరి కంటే ఎక్కువమంది ఈ నేరానికి పాల్పడటమో లేదా నిందితుడికి సహకరించి ఉంటారని మేం అనుమానిస్తున్నాం. దీనిపై దర్యాప్తు చేపట్టాం. హెల్ప్లైన్ నంబర్ను కూడా ప్రారంభించా. అనుమానితుల గురించి తెలిసిన వైద్య విద్యార్థులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు" అని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆర్జీ కార్ ప్రభుత్వాస్పత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. శరీరంపై వివిధచోట్ల గాయాలు కనిపించాయి. దీంతో ఆమెపై అత్యాచారానికి పాల్పడిన అనంతరం హత్య చేసినట్లు పోలీసులు నిర్ధరించారు. నిందితుడిని అరెస్టు చేశారు.

# ఉక్రెయిన్ మార్గంలో బంగ్లాదేశ్

● నిన్నటి వరకు మిత్రదేశం.. నేడు శత్రువు ● పదేళ్ల క్రితం ఉక్రెయిన్ రాజధాని కీవ్లో పెద్ద ఎత్తున ప్రజాందోళన ● హింసాత్మకంగా మారిన నిరసనకారులు చేపట్టిన ఆందోళన ● రష్యాలో ఆశ్రయం పొందిన విక్టర్ యంకోవిచ్

ఢిల్లీ, ఢాకా, ఖాట్మండ్: బంగ్లాదేశ్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు చూస్తుంటే.. పదేళ్ల క్రితం ఉక్రెయిన్లో జరిగిన పరిణామాలు గుర్తుకొస్తున్నాయి. అప్పటి వరకు మిత్రరాజ్యాలుగా ఉన్న దేశాలే ఒక్కసారిగా శత్రువులుగా మారిపోయిన పరిస్థితి ఉక్రెయిన్ – రష్యా మధ్య చోటుచేసుకోగా.. ఇప్పుడు బంగ్లాదేశ్–భారత్ మధ్య సంబంధాలు సైతం అదే మాదిరిగా మారాయి. సరిగ్గా పదేళ్ల క్రితం ఉక్రెయిన్ రాజధాని కీవ్లో పెద్ద ఎత్తున ప్రజాందోళన చెలరే గింది. నిరసనకారులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఇం దులో కొందరు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు మరింత ఉధృతంగా విరుచుకుపడ్డారు. ఫలితంగా నాటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యంకోవిచ్ గద్దె దిగాల్సి వచ్చింది. అంతేకాదు, తన ప్రాణాలు కాపాడుకోడానికి రష్యాలో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. విక్టర్ యంకోవిచ్ రష్యా అనుకూల వైఖరిని అవలంబించారు. యురోపియన్ యూనియన్, నాటో లో ఉక్రెయిన్ చేరాలన్న ప్రతిపాదనలను ఆయన వ్యతిరేకించారు. ఈ క్రమంలో యంకోవిచ్ను ఆ పదవి నుంచి తప్పించడం కోసం అగ్రరాజ్యం అమెరికానే కుట్ర చేసిందని అప్పట్లో అనేక కథనాలు, విశ్లేషణలు వచ్చాయి. ఉక్రెయిన్ ప్రజాందోళన వెనుక అమెరికా మద్దతు ఉందన్న విషయాన్ని ఆ దేశానికి డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్గా పనిచేసిన విక్టోరియా నులాండ్ స్వయానా అంగీకరించారు. ఉక్రెయిన్ ప్రజాందోళనలు కేవలం అధ్యక్షుణ్ణి గద్దె దించడం, ప్రభుత్వాన్ని పడగొట్టడం వరకే పరిమితం కాలేదు. అంతటితో ఉద్యమం ముగియలేదు. ఉక్రెయిన్లో రష్యన్ భాష ఎక్కువగా మాట్లాడే క్రిమియా, డాన్బాస్ ప్రాంతాల్లో ఆందోళనలు దారితప్పాయి. రష్యన్ భాష మాట్లాడే ప్రజలను నిరసనకారులు లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. ఈ పరిస్థితుల్లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్న క్రిమియాను రష్యా ఆక్రమించుకుని, తమ భూభాగంలో కలుపుకుంది. ఆనాడు రగులుకున్న నిప్పు.. దశాబ్దకాలంగా కొనసాగుతూ 2022లో రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీసింది. తీరా ఇంతజరిగినా ఇప్పటికీ ఉక్రెయిన్ యురోపియన్ యూనియన్లో, నాటోలో సభ్యత్వం పొందలేకపోయింది. మొత్తంగా ఒకనాటిసోవియట్ యూనియన్లో భాగంగా ఉన్న ఉక్రెయిన్, రష్యా ప్రభావం నుంచి బయటపడాలన్న ఆలోచనతో మొదలైన ప్రజా ఉద్యమంచి వరకు ఆ దేశాన్ని అమెరికా కబంధ హస్తాల్లోకి నెట్టేసింది. పేరుకు ఉక్రెయిన్ – రష్యా యుద్ధంలా కనిపిస్తున్నప్పటికీ.. అది అమెరికా – రష్యా మధ్య జరుగుతున్న యుద్ధమని, మధ్యలో ఉక్రెయిన్ బలి పశువుగా మారిందని ప్రపంచ పరిణామాల గురించి అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది.

**బంగ్లాదేశ్లోనూ ఉక్రెయిన్ తరహా పరిస్థితులు**

సరిగ్గా ఉక్రెయిన్ తరహాలో పదేళ్ల తర్వాత బంగ్లాదేశ్లో దేశాధినేతను గద్దె దించడమే లక్ష్యంగా ప్రజా ఉద్యమం ఎగిసిపడింది. 2024 జూన్ నెలలో మొదలైన ఉద్యమం, జులై నాటికి తీవ్రరూపం దాల్చి హింసాత్మకంగా మారింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన ఈ ఆందోళనల్లో పలువురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో నిరసనకారులు మరింత రెచ్చిపోయారు. ఆగస్ట్ నాటికి ఆ ఆందోళనలు దేశ ప్రధాని షేక్ హసీనా నివాసాన్ని ముట్టడించే వరకు చేరుకున్నాయి. విధిలేని పరిస్థితుల్లో హసీనా దేశాన్ని విడిచి తాత్కాలికంగా భారత్లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. ఉక్రెయిన్ మాదిరిగానే ప్రజాందోళనలు దేశాధినేతను గద్దె దించాయి. సోవియట్ యూనియన్లో భాగంగా ఉండి, విడిపోయి స్వతంత్ర రాజ్యంగా ఉన్న ఉక్రెయిన్ తమ మాతృదేశం లాంటి రష్యాతో కయ్యం పెట్టుకోగా.. ఇప్పుడు ఒకనాటి బ్రిటీష్ ఇండియాలో భాగంగా భారత్లో అంతర్భాగంగా ఉండి, 1947లో విడిపోయి ఈస్ట్ పాకిస్తాన్గా, ఆ తర్వాత భారత్ చొరవతో స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్లో కూడా భారత్ వ్యతిరేక భావజాలమే ప్రస్తుతం కనిపిస్తోంది. నిరసనకారులు షేక్ హసీనాను 'భారత ఏజెంట్' అని నిందించడమే కాదు, భారత్ అనుకూల వైఖరిని తప్పుబట్టారు. ఇక్కడ కూడా ప్రజాందోళనలు హసీనాను గద్దె దించడంతో శాంతించలేదు. భారత్ అనుకూల వైఖరితో ఉండే మైనారిటీ వర్గాలైన హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు, హింసకు పాల్పడుతున్నారు. అయితే ఈ ఆందోళనల వెనుక కూడా అమెరికా హస్తం ఉందన్నది షేక్ హసీనా ఆరోపణ. బంగ్లాదేశ్లోని సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని తమ సైనిక అవసరాల కోసం ఇవ్వాల్సిందిగా అమెరికా అడిగిందని, అందుకు తాను అంగీకరించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని హసీనా వెల్లడించారు.

**భారత్–బంగ్లా మైత్రి కొనసాగేనా? :**

అసలే భారత వ్యతిరేక వైఖరితో ఉన్న నిరసనకారులు.. షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఈ రెండు దేశాల మధ్య కొనసాగిన సత్సంబంధాలు, మైత్రిని ప్రశ్నార్థకంలో పడేసేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ వైఖరి కనిపిస్తోంది. ఆ దేశంలో భారత్ వస్తువులను బహిష్కరిస్తున్నారు. భారతీయులపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. గతంలో హిందీ భాష వాడకంపై బంగ్లాదేశ్లో వ్యతిరేకత వ్యక్తమైంది. హిందీ భాషను ఉపయోగించడాన్ని నిరసనకారులు బంగ్లాదేశ్కే అవమానకరమని బహిరంగంగానే వ్యాఖ్యానిం చారు.



ఇదంతా ఒకెత్తయితే..షేక్ హసీనా అధికారంలో ఉండగా భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్నుఉపయోగించుకుని తనకు వ్యతిరేకం గా వ్యవహరించేవారిపై మారణహోమానికి పాల్పడ్డారని నిందిస్తు న్నారు. తాత్కాలికంగా ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం ఇప్పటికే అనేక మంది రా ఏజెంట్లను అరెస్టు చేయడమే ఇందుకు నిదర్శనం. మొత్తంగా బంగ్లాదేశ్ సర్వసత్తాక స్వతంత్ర రాజ్యంగా అవతరించడానికి సహకరించిన భారతదేశంపై కృతజ్ఞ తాభావం ఉండాల్సిన చోట బంగ్లాదేశ్ కొత్త తరాన్ని భారత్ పట్ల విషాన్ని నింపుతోంది. యువతను రెచ్చగొడుతోంది. షేక్ హసీనా పాలనలో వాణిజ్యం, సరిహద్దులు, రక్షణ సహా అనేక ఇతర రంగాల్లో పరస్పర సహకారానికి ద్వైపాక్షిక ఒప్పందాలు, నదీ జలాల ఒప్పందాలు చేసుకున్న భారత్కు ప్రస్తుతం బంగ్లాదేశ్లో నెలకొన్న పరిణామాలు ఆందోళన కల్గిస్తున్నాయి. కొత్త ప్రభుత్వంతో కూడా సత్సంబంధాలు కొనసాగించాలన్న భారత్ ప్రయత్నాలకు ఇవన్నీ అడ్డంకిగా మారాయి.

**హసీనాను అప్పగించండి :** బంగ్లాదేశ్లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు.. షేక్ హసీనాను బంగ్లాదేశ్ ప్రభుత్వానికి అప్పగించాలని భారతదేశాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాందోళనలను అణిచివేసే క్రమంలో జరిగిన కాల్పులు, నిరసనకారుల మరణాలపై షేక్ హసీనాను హత్యానేరం కింద కేసులు పెట్టాలన్నది వారి డిమాండ్గా ఉంది. మరోవైపు తమ ఉద్యమానికి ఎలాంటి విదేశీశక్తుల సహాయం లేదని చెబుతున్నారు. తమ ఉద్యమాన్ని కించపరిచేందుకు భారత్ చేస్తున్న కుట్రగా వారు అభివర్ణిస్తున్నారు. ఆ దేశంలో మైనారిటీలపై ఎలాంటి దాడులు జరగలేదని, కేవలం భారత్ చేస్తున్న దుష్ప్రచారమేనని నిందిస్తున్నారు. మొత్తంగా నిన్నమొన్నటి వరకు ప్రపంచమంతా మెచ్చుకున్న భారత్–బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ మాదిరిగా మారడం అందరికీ ఆందోళన కల్గిస్తోంది. ఇది భవిష్యత్తులో భారత్ – పాకిస్తాన్ తరహా ఉద్రిక్త పరిస్థితులకు దారితీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## సుప్రీంను ఆశ్రయించిన సీఎం కేజ్రీవాల్

● సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ల
● తనను విడుదల చేయాలని కోరిన సీఎం
● అత్యవసర విచారణ జరపాలని కోరిన కేజ్రీవాల్ న్యాయవాది
● మెయిల్ అభ్యర్థన పంపాలన్న చీఫ్ జస్టిస్

ఢిల్లీ:ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టైన తనను విడుదల చేయాలని సోమవారం అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఎక్సైజ్ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్పై జూన్లో దిల్లీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు ఇది వ్యతిరేకంగా ఉందని పిటిషన్లో వెల్లడించారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది సుప్రీంను కోరగా తమకు మెయిల్ అభ్యర్థన పంపాలని భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఎన్నికల అనంతరం ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. కాగా ఈడీ అరెస్టు కేసులో సుప్రీం సీఎంకు జులై 12న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

## గవర్నర్ కు జైలు నుంచి కేజ్రీవాల్ లేఖపై దుమారం

● తన స్థానంలో మంత్రి అతిశీ జెండా ఎగురవేస్తారు ● ఢిల్లీ గవర్నర్ వీకే సక్సేనాకు సీఎం కేజ్రీవాల్ లేఖ ● తప్పు పడుతున్న జైలు అధికారులు ● అధికార దుర్వినియోగమేనంటున్న అధికారులు




ఢిల్లీ: మద్యం కేసులో అరెస్టయి జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ జైలు అధికారులు పేర్కొన్నట్టు సంబంధిత వర్గాల సమాచారం. జైల్లో ఉన్న కారణంగా.. ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో తన స్థానంలో ఢిల్లీ మంత్రి అతిశీ జెండా ఎగురవేస్తారని పేర్కొంటూ గవర్నర్ వీకే సక్సేనాకు కేజ్రీవాల్ లేఖ రాశారు. జైలు అధికారులు సీఎం చర్యలను ఖండించారు. ఆయన జైలు నింబంధనలను ఉల్లఘించారని పేర్కొన్నారు. "నిబంధనల ప్రకారం.. జైల్లో ఉన్న వ్యక్తి తన వ్యక్తిగత విషయాలను మాత్రమే లేఖలో పేర్కొనాల్సి ఉంటుంది. కానీ, దిల్లీ సీఎం కేజ్రీవాల్ ఎల్జీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య వేడుకల గురించి అందులో ప్రస్తావించారు. ఇది పూర్తిగా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. అందుకే ఈ లేఖ బయటకు వెళ్లలేదు" అని వర్గాలు వెల్లడించాయి.

**గవర్నర్ కార్యాలయానికి చేరుకోకముందే లీక్ ?**

ఈ లేఖ ఎల్జీ కార్యాలయానికి ఇంకా చేరుకోలేదు. అయినప్పటికీ.. అందులోని విషయాలు ఎలా లీక్ అయ్యాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. దీంతో కేజ్రీవాల్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. జైలు నిబంధనలకు అనుగుణంగా ప్రవర్తించకపోతే.. చర్యలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. కాగా.. జైలు నుంచి తనను విడుదల చేయాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. తమకు మెయిల్ అభ్యర్థన పంపాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై. చంద్రచూడ్ సూచించారు. దిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలోని మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ను సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు.. ఇదే కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా ఇటీవల బెయిల్పై విడుదలయ్యారు.

## స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథులు

● 150 మంది మహిళా సర్పంచులకు ఆహ్వానం ● పథకాలను విజయవంతంగా అమలు చేసిన వారికి ప్రాధాన్యత ● ఏపీ నుంచి వెళ్లేందుకు పలువురికి అవకాశం ● ప్రధానమంత్రి ఎక్సలెన్స్ అవార్డుతో సత్కారం

ఢిల్లీ: ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. ఈ ప్రత్యేక అతిథులు 150 మంది మహిళా సర్పంచ్లు. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో వారు అద్భుతమైన కృషి చేసినట్లు సమాచారం. ఓ జాతీయ మీడియా సంస్థ ప్రకారం.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఇప్పటికే వారికి ఆహ్వానం అందింది. ఈ మహిళా సర్పంచ్లందరూ 'ప్రధానమంత్రి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎక్సలెన్స్ అవార్డు' జాబితాలో ఎంపిక చేయబడ్డారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, గుజరాత్, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపిక చేయబడిన ఈ సర్పంచ్లు ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అసాధారణమైన పనితీరు కనబరిచారని ఓ అధికారి తెలిపారు ఈ విషయం గురించి ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ 150 మంది మహిళా సర్పంచ్లను పిలవాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. పంచాయతీ స్థాయిలో రాజకీయ నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి, గుర్తించడానికి ప్రభుత్వ నిబద్ధతను ఇది నొక్కి చెబుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయాలు, పరిపాలనలో మహిళలు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడమే దీని లక్ష్యం. మహిళా శక్తిని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న విస్తృత ప్రచారానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకోబడింది." అని ఆయన వ్యాఖ్యానించారు.నారీ శక్తి అభియాన్ మరింత బలపడుతుంది ఇటీవలి 50కి పైగా గ్రామీణ లోక్సభ నియోజకవర్గాలలో జరిగిన ఎన్నికల ఓటమి నేపథ్యంలో.. మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మహిళలను ఆహ్వానించడం ద్వారా, పరిపాలన అట్టడుగు నాయకత్వానికి, నారీ శక్తి అభియాన్ పట్ల బీజేపీ తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తోంది. ఈ ప్రయత్నం నారీమణులను గుర్తించడమే కాకుండా.. మహిళలకు సాధికారత కల్పించడం, గ్రామీణ పాలనను పెంపొందించడాన్ని బలోపేతం చేయడానికి కేంద్రం యత్నిస్తోంది.

## కవిత బెయిల్ పిటిషన్పై బిగ్ ట్విస్ట్

● ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు నోటీసులు
● మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
● విచారణ ఈనెల 20కి వాయిదా
● కవిత తరపున ముకుల్ రోహత్గి వాదనలు



ఢిల్లీ: సుప్రీంకోర్టులో కవిత బెయిల్ పిటిషన్పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచ్చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది.ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్షీట్లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుపు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థల తీరును ఆమె తరుపు న్యాయవాది తప్పుబట్టారు. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని.. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని.. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసు కోలేదు.

### జపోరిజియా అణువిద్యుత్ కేంద్రంలో

# భారీ మంటలు

● ఐరోపాలో అతిపెద్ద అణువిద్యుత్ కేంద్రం ● ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉన్న అణు కేంద్రం ● పరస్పరం నిందించుకొంటున్న రష్యా, ఉక్రెయిన్ ● కీవ్ను బ్లాక్ మెయిల్ చేసేందుకేనంటున్న జెలెన్స్కీ



కీవ్, మాస్కో: ఐరోపాలో అతిపెద్ద అణువిద్యుత్తు కేంద్రాల్లో ఒకటైన ఉక్రెయిన్కు చెందిన జపోరిజియాలో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్ నియంత్రణ రష్యా అధీనంలో ఉంది. ఈ ప్లాంట్లో మాస్కో దళాలే పేలుళ్లకు పాల్పడ్డాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. వారు కీవ్ను బ్లాక్ మెయిల్ చేసేందుకు ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. మరోవైపు రష్యా మాత్రం ఉక్రెయిన్ దళాలు ప్రయోగించిన ఫిరంగి గుండ్ల కారణంగానే మంటలు వ్యాపించాయని చెబుతోంది. ప్రస్తుతం ఆ ప్రదేశంలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ సిబ్బంది కూడా ఉన్నారు. ప్రస్తుతానికి ఎటువంటి అణు లీక్ చోటుచేసుకోలేదని చెప్పారు. మంటలు వ్యాపించిన ప్రదేశానికి తమను వెళ్లనీయాలని కోరారు. మరోవైపు ఆ అణువిద్యుత్తు కేంద్రానికి సంబంధించిన కూలింగ్ టవర్లో ఆదివారం భారీగా మంటలు చెలరేగాయి. ఈవిషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న రష్యా నియమిత గవర్నర్ యూవ్గెవ్నీ బాలిటెస్కీ పేర్కొన్నారు. తమ దళాలు వాటిని సోమవారం నాటికి పూర్తిగా ఆర్పేశాయని వెల్లడించారు. 2022లో రష్యా దళాలు ఈ అణుకేంద్రాన్ని తమ అధీనంలోకి తీసుకొన్నాయి. దీంతో రెండేళ్ల నుంచి ఇక్కడ విద్యుదుత్పత్తిని నిలిపివేశారు.

## ముఖ్యమంత్రితో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే భేటీ

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: వెలగపూడి సచివాలయంలోని సీఎం చాంబర్ లో సోమవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.



# కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి బైరా దిలీప్ చక్రవర్తి

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఎంపీ టికెట్ ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి పేరు విశాఖ స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కూటమి అభ్యర్థి గా ప్రకటించారు . ఈ ఎన్నికకు సంబంధించి నామినేషన్లకు ఈనెల 13వ తేదీతో గడువు ముగియనున్నది .కాగా, విశాఖ నగరంలోని ఒక హోటల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జి సీతంరాజు సుధాకర్, తదితరులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయాలని నేతలంతా నిర్ణయించారు. పోటీకి సుముఖంగా ఉన్న పీలా గోవింద, గండి బాబ్జీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బైరా దిలీప్ పేరు చర్చకు వచ్చింది. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు పల్లా శ్రీనివాసరావుకు నివేదించారు. అత్యధికులు బైరా దిలీప్ పేరు ప్రతిపాదించ దంతో నేడు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికారికంగా ఆయన పేరు ప్రకటించారు. ఇక వైసిపి తరువున బొత్స సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ టిక్కెట్పై పోటీ చేయాలని భావించారు. కాకపోతే సీఎం రమేష్ పేరు తెరపైకి రావడంతో ఆయన సైలెంట్ అయ్యారు. తాజాగా ఆయనకు అదృష్టం వరించిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నమాట. చిరంజీవి, పవన్కల్యాణ్, గంటా శ్రీనివాసరావుతో ఆయనకు మంచి సంబంధాలు న్నాయి.



# సెంట్రల్ జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పిస్తాం

- గంజాయి కేసులపై ఎక్కువ దృష్టి సారిస్తున్నాం
- సైక్రియాట్రిస్టులను అందుబాటులో ఉంచుతాం
- ఇకనుంచి మహిళా పోలీసు స్టేషన్లగానే దిశ స్టేషన్‌లు
- ప్రిజన్స్ కేఫ్ ప్రారంభించిన హోం విపత్తుల నిర్వహణ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు బయటకు వెళ్ళాక నేర ప్రవృత్తివైపు వెళ్లకుండా ఉండేందుకు ఫ్యూయల్ అవుట్ లెట్స్, ప్రిజన్ కేఫ్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర విపత్తుల నిర్వహణ మరియు హోం శాఖ మంత్రి వంగలపూడి వనిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఇన్నిస్ పేట సమీపంలో వున్న సబ్ జైలు ఆవరణలో ఏపి ప్రిజన్స్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభించిన అనంతరం సెంట్రల్ జైలు, మహిళా జైలు సందర్శించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు ఎదురుగా ఏర్పాటుచేసిన ప్రిజన్స్ కేఫ్ని మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హోమ్ మంత్రి అనిత మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఖైదీలకు మంచి ప్రవర్తన కల్గించడంలో భాగంగానే ప్రిజన్స్ కేఫ్, పెట్రోలు బంకు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 16సబ్ జైళ్ళు, రెండు సెంట్రల్ జైళ్ళు, ఒక స్పెషల్ జైలు ఉండగా, ఒక బోస్టన్ జైలు కడుతున్నట్లు వివరించారు. జైళ్లలో మొత్తం 3వేల 483మంది ఖైదీలు ఉన్నారని, ఉండాల్సిన సంఖ్య కంటే అధికంగా 700 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. రాజమండ్రిలో 1200 మంది సామర్ధ్యానికి అదనంగా 50మంది ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి కేసులపై ఎక్కువ దృష్టి పెట్టామని, రాష్ట్రంలో 1700 మందిని అరెస్టు చేయగా, అందులో ఒక్క విశాఖలోనే వెయ్యిమంది వరకు ఉన్నారని, అలాగే రాజమండ్రి జైలులో 376మంది ఉన్నారని హోం మంత్రి అనిత చెప్పారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన వారికోసం సైకిట్రిస్టులను ఏర్పాటుచేసి, అవగాహన కల్పించడంతో పాటు డీ ఎడిక్షన్ సెంటర్స్ కూడా పెట్టాలని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. సెంట్రల్ జైలు, మహిళా జైలు చూసాక అక్కడి ఇబ్బందులు , సౌకర్యాలు గురించి తెలుసుకున్నామని ఆమె తెలిపారు. ముఖ్యంగా స్నేహ బ్లాక్ చూసిన తర్వాత భావోద్వేగానికి గురయ్యామని హోం మంత్రి అనిత చెప్పారు. ఈ రాష్ట్రాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని చేయని నేరానికి 53 రోజులపాటు జైలులో ఉంచడం దారుణమని అందుకే ఆయనని పెట్టిన స్నేహ బ్లాక్ ని చూడగానే తట్టుకోలేకపోయానని చెప్పారు.

అలాగే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుని కూడా గతంలో అరెస్టు చేసి పెట్టిన బరాక్ కూడా చూశామని ఆమె తెలిపారు. అప్పుడు మా నాయకుడిని అరెస్టు చేసినపుడు ఎంతగానో బాధపడ్డామని ఇప్పుడుఅదే జైలుకి సందర్శనకు వచ్చామని ఆమె వివరిస్తూ, రోజులు అన్నీ ఒకేలా ఉండవన్నారు. అదే ప్రజా స్వామ్యం గొప్పతనమని అన్నారు. ఏ తప్పు చేయనివాడు అందులోకి వెళ్లకూడదన్నదే తమ భావనగా ఆమె చెప్పారు. ఇక జైలు సిబ్బంది చెప్పిన విషయాలు, సమస్యలు తెలుసుకున్నామని, ముఖ్యంగా సివిల్ పోలీసుల మాదిరిగా ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారని, ఇప్పటివరకు ఆరోగ్య భద్రత లేక పోవడం శోచనీయమని ఆమె పేర్కొంటూ వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్య భద్రత కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఖైదీలకు క్షమాభిక్ష గత ఐదేళ్లలో అసలు పట్టించుకోలేదని హోం మంత్రి అనిత గుర్తుచేస్తూ క్షమాభిక్ష ఇచ్చే విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గత 24ఏళ్లుగా జైలులో ఉండిపోయానంటూ ఒక ఖైదీ తన దృష్టికి తెచ్చాడని ఆమె పేర్కొన్నారు. అలాగే పెరోల్ నిబంధనలను కూడా సమీక్షిస్తామన్నారు. గతంలో ఒక వ్యక్తి ష్యూరిటీ ఇస్తే సరిపోయేదని, ఈ నిబంధన మార్చడం వలన ఇబ్బంది వస్తోందని గమనించామని ఆమె చెబుతూ దీన్ని సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

దిశ చట్టమే లేకుండా దిశా పోలీసు స్టేషన్లు పెట్టడంలో అర్ధం లేదని హోమ్ మంత్రి పేర్కొంటూ గతంలో మాదిరిగా మహిళా పోలీస్ స్టేషన్లుగానే వ్యవహరించనున్నట్లు ఆమె స్పష్టం చేసారు. ఐదేళ్లుగా ఒక విధా నంలో వెళ్ళినపుడు మార్పు రావడానికి కొంత సమయం పడుతుందని, మొత్తం మీద ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తున్నట్లు ఆమె చెప్పారు. పోలీసుల్లో శారీరక ధృఢత్వాన్ని పెంచే దిశగా నెట్ ప్రాక్టీస్ క్రికెట్ ను మంత్రి అనిత ప్రారంభించి బ్యాట్ తో క్రికెట్ ను ఆడగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బౌలింగ్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వెంట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, జైళ్ల ఐజి విశ్వజిత్, డి.ఐ.జి. ఆఫ్ ప్రిజన్స్ ఎం ఆర్ రవి కిరణ్, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఓ పరివర్తన పారిశ్రామిక యుగానికి చేరువగా ఆంధ్ర ప్రదేశ్

- సీఎం చంద్రబాబు దార్శనికతే.. ఏపీ ప్రగతికి బాటలు
- రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కానున్న ఎంఎస్ఎంఈలు
- వికసిత ఆంధ్రప్రదేశ్ సాధనే కూటమి సర్కార్ సంకల్పం
- నిరుపేదలు లేని సమాజ స్థాపనే మా ప్రభుత్వ ధ్యేయం
- చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు



చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్: ఓ పరివర్తన పారిశ్రామిక యుగానికి ఆంధ్ర ప్రదేశ్ చేరువుగా ఉందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దార్శనికతే రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందన్నారు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలకు హాజరైన ప్రసాదరావు , సోమవారం ఆంధ్ర ప్రదేశ్ పురోభివృద్ధి పై స్పందించారు. ఏపీ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుంచి కేంద్ర మంత్రులంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విషయంలో కీలక భూమిక పోషించనున్నారని ఆయన తెలిపారు. వికసిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. వీరి నేతృత్వంలో ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం లోనే ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు దార్శనికతతో కూడిన నాయకత్వంలో, రాష్ట్రం తాజా సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా, అమరావతికి ప్రపంచ దిగ్గజాలను ఆకర్షించడంలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. గూగుల్, యూట్యూబ్తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో , సాంకేతిక అభివృద్ధి కోసం వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పరచడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను పెంపొందించడం, నైపుణ్యాభివృద్ధిని అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన పాలన కోసం సాంకేతికతను ఉపయోగించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, సుస్థిరత, డిజిటల్ క్రెడిట్ ద్వారా స్టార్టప్లు, ఎస్ ఎం ఈ లు లకు మద్దతు ఇవ్వడంలో ఏ వన్ అప్లికేషన్లను పరిష్కరిస్తూ, అమరావతిలో యూట్యూబ్ అకాడమీని, ఏ వన్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ పవర్డ్ బై గుల్ కోసం ఒక అవగాహన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తూ, రాష్ట్ర పురోగతిని గూగుల్ ప్రతినిధులు ప్రశంసించడం అభినందనీయమన్నారు. వ్యూహాత్మక రోడ్మ్యాప్లో సమగ్ర పారిశ్రామిక విధానాలు, ఎస్ ఎం ఈ లు మద్దతు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, ఎలక్ట్రానిక్స్, ఐటీ , టెక్స్టైల్స్లో ఏపి పురోగతిని సాధించిందని ఆయన చెప్పారు. పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరచడం, పారిశ్రామికవేత్తలతో నమ్మకాన్ని పునర్నిర్మించడం, కీలకమైన పారిశ్రామిక సమూహాలు, నోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా, ఆంధ్రప్రదేశ్ తన విస్తారమైన సామర్థ్యాన్ని అన్లాక్ చేయగలదన్నారు. శ్రీ ప్రసాద్ రావు గారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ , ఎన్ టీ పి సి గ్రీన్ హైడ్రోజన్ హబ్ వంటి ప్రాజెక్టులు పారిశ్రామిక వృద్ధి , సుస్థిరతకు ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను హైలైట్ చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న సవాళ్లను ఎదుర్కోవడానికి, పెట్టుబడిదారులు, వ్యాపారాలకు సహాయక వాతావరణాన్ని పెంపొందించడానికి సమిష్టి ప్రయత్నాలతో, ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పారిశ్రామిక పురోగతి, ఆర్థిక వృద్ధిని సాధించి, ప్రపంచ స్థాయిని ఆకర్షిస్తోందని వెల్లడించారు. కుప్పం, మూల్పేట్, చిలమత్తూరు, దొనకొండ, పామూరు వంటి ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయడం వల్ల వనరులు, మౌలిక సదుపాయాలను కేంద్రీకరించడం ద్వారా లక్ష్య పారిశ్రామిక వృద్ధిని సాధించవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రభుత్వ సంకల్పమైన వికసిత ఆంధ్ర ప్రదేశ్ సాధన సాధ్యమవుతుందన్నారు. అదే సమయంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. అంతేకాకుండా ఏపీలో నిరుపేదలలేని సమాజ స్థాపన వైపు అడుగులు వేసేందుకు వీలవుతుందని ప్రసాద్ రావు ఓ ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రెవెన్యూ, విద్యుత్ శాఖ మంత్రి అనగాని సత్య

ఏపీ బ్యూరో, సూర్య: తిరుమల శ్రీవారిని నేటి సోమవారం ఉదయం రెవెన్యూ, విద్యుత్ శాఖ మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ వి ఐ పీ విరామ సమయంలో దర్శించుకుని ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. **మొదటగా రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ ..** తెలుగు ప్రజలందరూ బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా,సస్యశ్యామలంగా ఉండాలని కోరుకున్నానని, గతంలో జరిగినటువంటి అన్యాయాల వలన ఇబ్బంది పడిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలని ప్రజలందరూ ఏకతాటిపై ఓటు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించి చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిగా చేశారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కూడా తిరుమలలో నేడు లక్ష మందికి పైగా మొక్కులు తీర్చుకోవడం స్వయంగా చూస్తున్నానని, గత ఐదు సంవత్సరాలుగా తీవ్రంగా నష్టపోయామని 30 సంవత్సరాల వెనక్కి వెళ్ళామని, నష్టపోయిన కాలాన్ని తిరిగి పునర్నిర్మించుకోవడం కోసం మెరుగ్గా ముందుకెళ్తూ భావితరాలకు మంచి చేయాలని లక్ష్యంతో గతంలో 2020 విజన్ తో ముందుకొచ్చారని, నేడు 2047 అనే విజన్తో ముఖ్యమంత్రి ముందుకెళుతున్నారని తెలిపారు. రాష్ట్రమే కాదు దేశం కూడా మున్ముందు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మన ముఖ్యమంత్రి గారు అడుగులు వేస్తున్నారని తెలిపారు. తాను కూడా ముఖ్యమంత్రి గారిని అనుసరిస్తూ రెవెన్యూ శాఖ తరవున రెవెన్యూ సదస్సులను పెట్టి గత ఐదు సంవత్సరాలు ఈ రాష్ట్రంలో అన్యాక్రాంతం అయినటువంటి భూములకు సంబంధించి రెవెన్యూ సమస్యల పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 45 రోజులపాటు రెవెన్యూ సదస్సు నిర్వహించి అందులో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.గ్రామాలలో ఉన్నటువంటి ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి భయపడుతున్నారని సమాచారం తమ వద్దకు వచ్చిందని, ప్రజలను ఎవరైనా భయభ్రాంతులకు గురి చేస్తే అట్టివారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ పెట్టి వారి నుండి ఫిర్యాదులను తీసుకొని పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు.

వందల సంవత్సరాలుగా అన్యాక్రాంతమైన అసైన్మెంట్ ల్యాండ్స్ ను పరిశీలించి వాటికి పరిష్కారం చూపే దిశగా ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా తిరుమల శ్రీవారిని దర్శించుకొనుటకు తాను, రెవెన్యూ శాఖ మంత్రి వచ్చామని ప్రజలకి మంచి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గారు ముందుకు వెళుతున్నారని తాము కూడా వారి మార్గంలోనే వెళ్లి , ప్రజలు నచ్చే, మెచ్చే విధంగా పరిపాలనను కొనసాగిస్తామని, గత ప్రభుత్వం చేసినటువంటి పొరపాటులు సరిదిద్దుకుంటూ ముందుకెళతామని తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలలో



ఒక్క మెగా వాట్ విద్యుత్తు ఉత్పత్తి ఎక్కడ కూడా రాష్ట్రంలో జరగలేదని, విద్యుత్ చార్జీలను పరిశీలిస్తే ఏడు ఎనిమిది సార్లు పెంచారని, ప్రజలపై పెనుభారాన్ని మోపారని, రైతులకు మెరుగైన విద్యుత్ సౌకర్యం, ప్రజలకు నాణ్యమైన విద్యుత్తునిస్తు వినియోగానికి తగ్గ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు.

ఎన్నికల సమయంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉంటామని రైతులు నష్టపోయే విధంగా ఏ విధమైన నిర్ణయం తీసుకోబోమని తెలిపారు.

## హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం నగరంలో పర్యటన



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఉదయం 9.30 గంటలకి తూర్పుగోదావరి జిల్లా సబ్ జైళ్ళ అధికారి వారి కార్యాలయం (కోటిపల్లి బస్టాండ్) సమీపంలో నిర్మించిన పెట్రోల్ బంకు ప్రారంభిస్తారు. అనంతరం కేంద్ర కారాగారం సందర్శన తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్ ప్రారంభిస్తారు. ముఖ్య అతిథులు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత , పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎస్పి డి. నరసింహ కిషోర్, డి.ఐ.జి. ఆఫ్ ప్రిజన్స్ ఎం ఆర్ రవి కిరణ్, ఐ జి ఆఫ్ ప్రిజన్స్ డాక్టర్ ఐ. శ్రీనివాస రావు, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ , కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్ రాహుల్, తదితరులు పాత్రికేయ మిత్రులకి విందు మధ్యాహ్నం 12.30 నుంచి కేంద్ర కారాగార ఆవరణలో జరుగుతుంది.

# ఎయిడ్స్ వ్యాధి కట్టడి మీకు తెలుసా?




- పూర్తి అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ
- ఎయిడ్స్ నుండి రక్షణకు క్రమశిక్షణ జీవితమే మార్గం
- జిల్లా కలెక్టర్ డా. జి. సృజన

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఎయిడ్స్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పించి వ్యాధిని నివారించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని క్రమశిక్షణా జీవితమే ఎయిడ్స్ వ్యాధి రక్షణకు ఏకైక మార్గమని, వ్యాధి బారిన పడిన వారి పట్ల వివక్షత చూపకుండా మనోధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మొగల్రాజపురం సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన హెచ్ఐవి అండ్ ఎస్టిఐ (సెక్సువల్లీ ట్రాన్స్మిటెడ్ ఇన్ఫెక్షన్స్) అవగాహనలో భాగంగా మీకు తెలుసా ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్ను జిల్లా కలెక్టర్ జి. సృజన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దశల వారిగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాల ద్వారా ఎయిడ్స్ మహమ్మారి భూతం అనే భయం పోగొట్టి ప్రజల్లో ధైర్యం కల్పించడం ద్వారా వ్యాధిగ్రస్తుల కేసుల సంఖ్యను దాదాపు 86 శాతం తగ్గించడం జరిగిందన్నారు. ప్రజలలో మరింత అవగాహన కల్పించడం ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని పూర్తి స్థాయిలో అరికట్టగలుగుతామన్నారు. గతంలో పులిరాజుకు ఎయిడ్స్ వస్తుందా? అనే ఒక్క నినాదం ప్రజలను ఎంతో ఆలోచింప చేయగలిగిందన్నారు. నేటి మీకు తెలుసా కాంపెయిన్ ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఏవిధంగా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలు, వ్యాధి పరీక్షలు నిర్వహించుకోవడం, వైద్య సేవలు పొందడం, కండోమ్ వాడకం, వ్యాధి నివారణ పై చర్చాగోష్టులు నిర్వహించడం, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ఉండడం, టోల్ ఫ్రీ నెంబర్ 1097 ద్వారా సహకారం పొందడం, వైరల్లోడ్ తగ్గించడం వంటి అంశాలను మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ప్రచార పద్దతుల ద్వారా ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో ముఖ్యంగా ప్రజలు క్రమశిక్షణ జీవితాన్ని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. చెడు వ్యసనాలు, విచ్చలవిడి శృంగారానికి పాల్పడడం వంటి వాటికి దూరంగా ఉండడం ఉత్తమమైన మార్గం అని జిల్లా కలెక్టర్ జి. సృజన అన్నారు.

స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డా. కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పూర్తి స్థాయిలో నివారించేందుకు మీకు తెలుసా ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఒక థీమ్‌ను తీసుకుని ఎనిమిది వారాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించేందుకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 2023‘24 సంవత్సరంలో ఎయిడ్స్ వ్యాధి మరణాల రేటును 76.04 శాతానికి తగ్గించగలిగామని, అవగాహన సదస్సుల ద్వారా 90 శాతం మరణాలను అరికట్టడంతో పాటు నూరు శాతం ఎయిడ్స్ నివారించాలన్నదే లక్ష్యమన్నారు. వ్యాధి బారిన పడిన వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని, మందులను అందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. సృజన ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్ను సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా భాధ్యత కలిగిన పౌరునిగా పరిపూర్ణ చైతన్యంతో మానవతా వాదిగా ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తానని... మనసా వాచా కర్మణతో అన్ని విషయాలలో ముందుంటానని.. నాతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటివారు మీకు తెలుసా కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కెఎల్ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అహుతులను అలరించాయి. కార్యక్రమంలో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్లు డా. కామేశ్వర ప్రసాద్, డా. మంజుల, డా. భాగ్యలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ డా. సరస్వతి దేవి, కో‘ఆర్డినేటర్ డా. రాజేంద్రప్రసాద్ , డియంఅండ్ హెచ్వో యం. సుహాసిని, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారిణి డా. జి. ఉషారాణి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో‘ఆర్డినేటర్ ఎస్ రామ్, యువజన సర్వీసుల శాఖ జిల్లా మేనేజర్ సుబ్బారావు, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో‘ఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు.

# నామినేషన్ వేసిన బొత్స



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా సోమవారం నామినేషన్ వేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కు ఈ నామినేషన్ పత్రాన్ని అందించారు. బొత్సతో పాటు ఆయన సతీమణి ఝాన్సీ, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ లు కలసి అందజేశారు. 530 పైచిలుక మాకు ఓట్లు ఉన్నప్పుడు తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థిని బరిలోకి దింపడం ఏమిటని అన్నారు. ఎన్నికలు ప్రజా స్వామ్య బద్ధంగా జరగాలని కోరుకుంటున్నానని అన్నారు. .స్పష్టమైన మెజార్టీ వైసీపీకి ఉన్నప్పుడు టీటీడీపీ పోటీ పెట్టడం వెనుక ఆంతర్యం ఏంటో అర్థం అవుతుందన్నారు. ఎవరో బిజినెస్ మన్ ని తీసుకొచ్చి పోటీకి పెడతారని ప్రచారం జరుగుతుందని బొత్స సత్యనారాయణ అన్నారు. రాజకీయాలంటే వ్యాపారమా అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ఏపీలో క్వార్టర్ బాటిల్ రూ.80 నుంచి 90 లోపే

- కొత్త మద్యం పాలసీలో అదిరిపోయే ఆఫర్
- హామీ ప్రకారం మద్యం రేట్లను భారీగా తగ్గించే దిశగా ప్రభుత్వం

అమరావతి : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం మద్యం రేట్లను భారీగా తగ్గించే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే వారికి రాత్రి కొద్దిగా మద్యం తాగి అలసటను తీర్చుకునే అలవాటు ఉంది. వైఎస్సార్సీపీ హయాంలో మద్యం నిషేధం పేరుతో ధరలను విపరీతంగా పెంచేసి, నకిలీ బ్రాండ్లను దించేశారు. దాంతో మద్యం ప్రియుల జేబులు గుల్ల కావడమే కాకుండా ఆరోగ్యమూ చెడిపోయింది. యువత కూడా గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలుగా మారిపోయారు. కూటమి ప్రభుత్వం తక్కువ ధర కేటగిరీలో వివిధ రకాల ప్రముఖ బ్రాండ్ల క్వార్టర్ బాటిల్ ధరను 80 నుంచి 90 రూపాయలకే విక్రయించాలని భావిస్తోంది. తక్కువ ధరలో నాణ్యమైన మద్యం: కొత్త మద్యం పాలసీ, ప్రొక్యూర్మెంట్ పాలసీపై ఎక్సైజ్ శాఖ కార్యాచరణ చేపట్టింది. కొత్త మద్యం విధానంపై రెండు రోజుల్లో అధికారుల కమిటీలు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నాయి. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో పర్యటించిన ఎక్సైజ్ శాఖ అధికారులు అక్కడి మద్యం విధానాల్ని అధ్యయనం చేశారు. ప్రముఖ లిక్కర్ కంపెనీలతో చర్చించారు. అన్ని రకాల ఎంఎన్సీ బ్రాండ్లకు అనుమతులివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలోగా ప్రముఖ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. తక్కువ ధరలో నాణ్యమైన మద్యాన్ని అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. నూతన మద్యం పాలసీ రూపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ధరలు భారీగా తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ప్రముఖ బ్రాండ్ల క్వార్టర్ బాటిల్ ధరను 80 నుంచి 90లోపే నిర్ధారించాలని సర్కార్ యోచిస్తోంది. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు: తక్కువ ధర కేటగిరీలో జగన్ ప్రభుత్వం క్వార్టర్ బాటిల్ను 200 రూపాయలకు అమ్మకాలు జరిపింది. అప్పట్లో అధిక ధరలకు మద్యం కొనలేక యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. జగన్ ప్రభుత్వ విధానాల వల్లే గంజాయి వినియోగం పెరిగిందని అధ్యయనంలో తేలినట్లు ప్రభుత్వం చెబుతోంది. రోజంతా వివిధ రకాల పనులు చేసుకునే పేదవారికి కూడా పెరిగిన ధరలతో




చాలా కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. చాలా మంది మహిళలు తన భర్త సంపాదించే సొమ్ము అంతా తాగుడుగే ఖర్చు పెట్టేస్తున్నారని ఇళ్లు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని అర్థం చేసుతున్న నాటి ప్రతిపక్ష పార్టీలు తెలుగుదేశం–జనసేన–బీజేపీలు మద్యం ధరలు తగ్గించి, నాణ్యమైన లిక్కర్ అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

## అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ముహూర్తం ఖరారు

- తొలి విడతలో 100 అన్న క్యాంటీన్లు ప్రారంభం




అమరావతి... ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్ల ప్రారంభం కానున్నాయి. తొలి విడతలో 100 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించనుంది. కృష్ణా జిల్లా ఉయ్యూరులో సాయంత్రం ఆరున్నర గంటలకు అన్న క్యాంటీన్ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఆగస్టు 16వ తేదీన మిగిలిన 99 క్యాంటీన్లను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. మొత్తం 33 మున్సిపాలిటీలలో 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని సర్కారు నిర్ణయించుకుంది. ఉయ్యూరులో ఈనెల 15వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరిశీలించారు. వీటికి ఆహార సరఫరా కాంట్రాక్టును హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్కు అప్పగించినట్లు సమాచారం. వలం 5 రూపాయలకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పూట భోజనాన్ని అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అందించనున్నారు. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఈ అన్న క్యాంటీన్లను తీసుకువచ్చారు.



# అమరావతి నిర్మాణానికి మంత్రి విరాళం

**ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందజేసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

అమరావతి.... ఏపీలో అమరావతి నిర్మాణం పనులు వేగంగా జరగుతున్నాయి. ఇటీవల కేంద్ర బడ్జెట్లో అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. రాజధాని నిర్మాణానికి విరాళాలు కూడా వస్తున్నట్లు తెలుస్తోంది. విరాళం ఇచ్చేదుందుకు మంత్రులు కూడా ముందుకు వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విరాళం అందజేశారు. సంబంధి ఛ3,01,116/- రూపాయల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి సచివాలయంలో అందజేశారు. విరాళం అందించిన మంత్రిని సీఎం చంద్రబాబు అభినందించారు.

# అగ్ర రాజ్యాన సీఎం రేవంత్ పర్యటన


# విజయవంతం




## రాష్ట్ర అభివృద్ధి కోసం పెట్టుబడులే లక్ష్యం
## పలు బహుళ జాతి సంస్థలతో సమావేశం
## రాష్ట్రంలో పారిశ్రామికరణతో ఆదాయం
## ఉద్యోగ ఉపాధి అవకాశాలు

*తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలోని బృందం చేపట్టిన అమెరికా పర్యటన విజయవంతం అయ్యింది. అమెరికా పర్యటన ముగించుకుని ప్రస్తుతం దక్షిణ కొరియాలో అడుగుపెట్టారు. 10 రోజుల విదేశీపర్యటనలో భాగంగా ప్రణాళికలో భాగంగా 7రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశామని రేవంత్ తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారీ అమెరికా కంపెనీలు ముందుకొచ్చాయని వెల్లడించారు. 19 అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అంగీకారం తెలిపాయని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అమెరికాలోని ఆయా కంపెనీలతో చర్చలు, ఏంఓయూలు చేశారు. అమెరికా పర్యటనలో రాష్ట్రానికి 31,532 కోట్ల పెట్టుబడులు, 30, 750 కొత్త ఉద్యోగాలు వచ్చినట్టు రేవంత్ వెల్లడించారు.*









ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతమైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రభుత్వ అధికారుల బృందం ఆగస్టు 3వ తేదీన అమెరికా పర్యటనకు బయల్దేరిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి సారథ్యంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు యాభైకి పైగా బిజినెస్ మీటింగ్, మూడు రౌండ్ మీటింగ్లలో పాల్గొంది. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఫార్మా మరియు లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాల్లో ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకునేందుకు కంపెనీలు అమితమైన ఆసక్తిని ప్రదర్శించాయి. ఈ పర్యటనలో ప్రపంచంలో పేరొందిన కాగ్నిజెంట్, చార్లెస్ స్వాబ్, ఆర్సీసియం కార్నింగ్, ఆమ్జెన్, జొయిటిస్, హెచ్సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మో ఫిసర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో విస్తరణకు, కొత్త కేంద్రాలు నెలకొల్పేందుకు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి.

**పెట్టుబడులు తరలిరావడం శుభసూచకం**

మరోవైపు హైదరాబాద్లో తమ డేటా సెంటర్ విస్తరణకు అమెజాన్ తీసుకున్న నిర్ణయం ఈ పర్యటనలో చెప్పుకోదగ్గ మైలు రాయిగా నిలిచింది. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ఈ పర్యటనలో యాపిల్, గూగుల్, స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలతో, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతోనూ చర్చలు జరిపింది. శనివారం అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకొని ముఖ్యమంత్రి దక్షిణ కొరియాకు బయల్దేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ బృందం అమెరికా పర్యటనపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికిందని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ నుంచి ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు తమ ప్రభుత్వం ఎంచుకున్న ప్రణాళికలకు అమెరికాలోని పారిశ్రామికవేత్తల నుంచి భారీ మద్దతు లభించిందని అన్నారు. తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు తరలిరావటం శుభసూచకమని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**అపారమైన ఉద్యోగ అవకాశాలు**


అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి తెలంగాణను సరికొత్తగా పరిచయం చేయగలిగామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు అన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని చాటిచెప్పేందుకు ఈ పర్యటన సత్ఫలితాలను అందించిందని అభిప్రాయపడ్డారు. దీని ప్రభావంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తటంతో పాటు అపారమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే ఆశాభావం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వ్యక్తం చేశారు.

రేవంత్ దృష్టంతా హైదరరాబాద్ ను ఫ్యూచర్ సిటీగా డెవలప్ చేయటంపైనే ఉంది. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ కు ధీటుగా మరో బాద్ ను డెవలప్ చేయాలని పట్టుదలగా ఉన్నారు. అందుకనే మహేశ్వరం, ఇబ్రహింపట్నం నియోజకవర్గాల పరిధిలోని ముచ్చర్ల గ్రామం ఏరియాలో సుమారు 20 వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీల రీసెర్చి, డెవలప్మెంట్, గేమింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వివిధ స్టార్టప్ కంపెనీల ఏర్పాటుతో పై ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా డెవలప్ చేస్తే తన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని రేవంత్ భావిస్తున్నారు. అందుకనే ఇంత పట్టుదలగా అమెరికా, దక్షిణకొరియాలోని అనేక కంపెనీల యాజమాన్యాలతో భేటీ అవుతున్నది.

తన అమెరికా పర్యటనలో పారిశ్రామికవేత్తలతో జరిగిన భేటీలు తెలంగాణా సరికొత్త భాగస్వామ్యానికి తెరలేపిందని రేవంత్ అంటున్నారు. తమ ఫ్యూచర్ సిటి ప్రణాళికలకు అమెరికాలోని చాలామంది పారిశ్రామికవేత్తల నుండి మద్దతు లభించినట్లు రేవంత్ అభిప్రాయపడుతున్నారు. తెలంగాణా లక్ష్యాలకు అనుగుణంగా, రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా తెలంగాణాలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం, ఒప్పందాలు చేసుకోవటం శుభసూచకమని రేవంత్ అన్నారు.

ఈ విషయం ఇంత నొక్కి చెప్పటం ఎందుకంటే ఏ ముఖ్యమంత్రి లేదా మంత్రులు విదేశీ పర్యటనలు చేసినా చాలా కంపెనీలు పెట్టుబడులు పెడతామంటు ఆసక్తి చూపటం సహజం. సాధారణంగా అవన్నీ ప్రచారానికి మాత్రమే పనికొస్తుంది. అయితే చేసుకున్నఒప్పందాలు కార్యాచరణలోకి రావాలంటే పర్యటన తర్వాత జరగాల్సిన తంతు చాలా ఉంటుంది. ప్రభుత్వం నిరంతరం కంపెనీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతు వాళ్ళతో టచ్ లో ఉంటే కాని చేసుకున్న ఒప్పందాలు సాకారం కావు. గతంలో చాలామంది ముఖ్యమంత్రులు, మంత్రులు పెట్టుబడుల కోసం విదేశాలకు లేదా దావోస్ లో పర్యటించారు. అప్పుడు చేసుకున్న ఒప్పందాల్లో ఎన్ని కంపెనీలు వాస్తవంగా పెట్టుబడులు పెట్టాయంటే చెప్పటం కష్టమే. కాబట్టి ఇపుడు రేవంత్ పర్యటన కూడా కేవలం ప్రచారం కోసమే అన్నట్లుగా కాకుండా వాస్తవరూపం దాల్చితేనే రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంది.

**విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181.**







## పెట్టుబడుల ఆకర్షణ

పెట్టుబడుల ఆకర్షణ కోసం రేవంత్ జరుపుతున్నవిదేశీ పర్యటన విజయ వంతమైందా? ఇప్పటికైతే అయ్యిందనే చెప్పాలి. ఎందుకంటే పదిరోజుల అమెరికా పర్యటన ముగించుకుని రెండు రోజుల దక్షిణకొరియాకు చేరుకున్నారు. అమెరికా పర్యటనలో అంతర్జాతీయ స్థాయి కంపెనీల యాజమాన్యాలతో రు. 31 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందా లన్నీ ఆచరణలోకి వస్తే సుమారు 31 వేల మంది ఉద్యోగ, ఉపాధి లభిస్తుంది.పదిరోజుల పర్యటనలో కాగ్నిజెంట్, చార్లెస్ స్వాబ్, ఆర్సీసియం, కార్నింగ్, ఆమ్ జెన్, జొయ్ టిస్, హెచ్సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, ట్రైజి న్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ లాంటి అనేక కంపెనీల సీఈవోలతో భేటీ అయ్యారు. హైదరాబాద్లో పెట్టుబడులు పెట్టడం వల్ల వచ్చే లాభలు, తెలం గాణాకు ఏ విధంగా లాభమో వివరించి చెప్పారు. అంటే పారిశ్రామి కవేత్త లతో సమావేశమైనపుడు ఇటు రాష్ట్రానికి అటు కంపెనీలకు విన్ విన్ సిట్యు యేషన్ అన్నట్లుగా వివరించారు. దాంతో చాలా కంపెనీల యాజమాన్యాలు తెలంగాణాలో(హైదరాబాద్) పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపించాయి.

కాగ్నిజెంట్ రెండో సెంటర్ విస్తరణ, అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు లాంటి కీలకమైన ఒప్పందాలు కూడా రేవంత్ పర్యటనలో జరిగాయి. వీటితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ లాంటి వాటితో తెలంగాణాలో కొత్తగా హైపర్ స్కిల్ డేటా సెంటర్లు ఏర్పాటు చేయటం చాలా మంచిదని చెప్పారు. దశలవారీగా తెలంగాణాకు రాబోతున్న కంపెనీల కారణంగా వేలాదిమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగటం ఖాయం. చేసుకున్న ఒప్పదాలన్నీ కార్యరూప దాల్చితే రేవంత్ విదేశీ పర్యటన సక్సెస్ అయ్యిందనే చెప్పాలి. మొత్తం 50 కంపెనీల యాజమాన్యాలతో రేవంత్ భేటీ అయితే ఒప్పందాలు చేసుకున్నది 19 కంపెనీలు.

## రూ. 31532 కోట్ల పెట్టుబడులు



తెలంగాణ పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచంలో పేరొందిన భారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ పర్యటనలో రూ. 31532 కోట్ల పెట్టుబడులను సాధించి తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా అమెరికాలోని పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. అమెరికా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను ఫ్యూచర్ స్టేట్గా ప్రకటించటం, హైదరాబాద్ 4.0 సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులకు భారీ స్పందన లభించింది. ఈ పర్యటనలో దాదాపు 19 కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో 30750 కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి.





## వినేష్ ఫొగట్ ఎఫెక్ట్..

### రెజర్ల బరువు కొలిచే నియమాల్లో మార్పులు

పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగట్ అనర్హత వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో అసాధారణ ప్రదర్శనతో ఫైనల్ చేరిన వినేష్ ఫొగట్.. చివరి నిమిషంలో 100 గ్రాములు అధిక బరువు ఉందనే కారణంతో డిస్క్వాలిఫై అయ్యింది. దాంతో రెజ్లింగ్ నియమాల ప్రకారం ఆమెకు ఏ పతకం రాలేదు. ఫైనల్ చేరిన వినేష్ ఫొగట్కు కనీసం రజత పతకమైనా ఇవ్వాలని భారత ఒలింపిక్ సంఘం(ఐఓఏ) కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ను ఆశ్రయించింది. ఇప్పటికే వాదనలు ముగియగా.. ఆగస్ట్ 13న తుది తీర్పు వెలువడనుంది. ఒకే రోజు మూడు మ్యాచ్లు ఉండటంతో శక్తి కోసం అధికంగా తినాల్సి వచ్చిందని, దాంతో బరువు పెరిగిందని వినేష్ ఫొగట్ తరఫున లాయర్లు వాదించారు.

వినేష్ ఫొగట్ అధిక బరువు కూడా 100 గ్రాములేనని, ఇది ప్రత్యర్థిపై ఏ మాత్రం ప్రభావం చూపదన్నారు. వినేష్ ఫొగట్ వ్యవహారం తీవ్ర వివాదాస్పదమవడంతో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రెజ్లర్ల బరువు కొలిచే నియమ నిబంధనల్లో మార్పులు చేయాలని ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మార్పులను పూర్తి స్థాయిలో కాకుండా అథ్లెట్ల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కొన్ని స్వల్ప మార్పులు చేస్తారని సంబంధిత వర్గాలు తెలిపినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# వినేష్ ఫొగట్‌దే తప్పు

### పీటీ ఉష సంచలన వ్యాఖ్యలు



పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగట్ అనర్హత వేటుకు గురవ్వడంతో భారత ఒలింపిక్ సంఘం(ఐఓఏ)తో పాటు వైద్య బృందంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అసాధారణ ప్రదర్శనతో ఫైనల్ చేరి రజత పతకం ఖాయం చేసిన వినేష్ ఫొగట్.. 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉందనే కారణంతో డిస్క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. దాంతో నిబంధనల ప్రకారం ఆమె ఏ పతకాన్ని అందుకోలేకపోయింది. ఈ వ్యవహారంపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ను ఆశ్రయించింది. ఇప్పటికే వాదనలు ముగియగా.. ఆగస్ట్ 13న తుది తీర్పు వెలువడనుంది. ఈ క్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష సంచలన వ్యాఖ్యలు చేశారు. వినేష్ ఫొగట్దే తప్పు.. వినేష్ ఫొగట్ వ్యవహారంలో ఐఓఏ వైద్య బృందం తప్పిదం ఏ మాత్రం లేదన్నారు. వినేష్ ఫొగట్తో పాటు ఆమె వ్యక్తిగత కోచ్లు, సిబ్బంది చేసిన తప్పిదం కారణంగానే ఈ సమస్య ఏర్పడిందని పేర్కొంది. ఐఓఏ వైద్య బృందం ఆటగాళ్ల గాయాల నుంచి కోలుకొనేలా చేయడంతో పాటు ఇంజూరీ మేనేజ్మెంట్పై అవగాహన కల్పిస్తుందని, ఆటగాళ్ల బరువు పెరగడం, తగ్గడం వారికి సంబంధం లేని వ్యవహారమని స్పష్టం చేసింది.

ఐఓఏ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్దివాలపై వచ్చిన విమర్శలను ఆమె తప్పుబట్టారు. 'రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో వంటి వెయిట్ కేటగిరి సంబంధించి క్రీడల్లో అథ్లెట్లు, కోచ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా ఉంటాయి. బరువు, ఫిట్నెస్ తదితర అంశాల్లో వారిదే పూర్తి బాధ్యత. ఇందులో ఐఓఏ మెడికల్ టీమ్ చేసేదేమీ ఉండదు. క్రీడాకారులకు గాయమైతే దానిని త్వరగా తగ్గించడానికి డాక్టర్లు ప్రయత్నిస్తారు. అంతేకానీ, అథ్లెట్ల బరువు అంశంలో భారత ఒలింపిక్ సంఘం నియమించిన వైద్య బృందం ఏం చేయలేదు. పారిస్ ఒలింపిక్స్లో పాల్గొన్న ప్రతీ అథ్లెట్కు సొంత సపోర్ట్ టీమ్ ఉంది. ఫిట్నెస్, బరువు, డైట్ వంటి వ్యవహారాలు అన్నీ వారే చూసుకోవాలి. అథ్లెట్ల విషయం లో వారిదే పూర్తి బాధ్యత. న్యాయం జరుగుతోంది.. వినేష్ ఫొగట్ అంశం మమ్మల్ని బాధపెట్టింది. ఐఓఏ మెడికల్ టీమ్పై విమర్శలు చేయడం ఏమాత్రం సరికాదు. డాక్టర్ పార్దివాలాను టార్గెట్ చేస్తూ ట్రోల్ చేయడం మంచిది కాదు. ఈ ట్రోల్స్, విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్లో మనకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. ఇప్పటికే వాదనలు ముగిసాయి. తుది తీర్పు ఆగస్ట్ 13 సాయంత్రం 6 గంటల్లోపు వచ్చే అవకాశం ఉంది.'అని పీటీ ఉష.. ఐఓఏ తరఫున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారమే ఆడి ఫైనల్ చేరిన వినేష్ ఫొగట్కు రజత పతకం ఇవ్వాలని ఐఓఏ డిమాండ్ చేస్తోంది. తుది తీర్పు వచ్చే ముందు పీటీ ఉష వినేష్ ఫొగట్దే తప్పు అంటూ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కెప్టెన్‌లుగా రోహిత్, గిల్, పంత్, బుమ్రా




శ్రీలంక పర్యటన తర్వాత టీమిండియాకు లాంగ్ బ్రేక్ లభించింది. 42 రోజుల అనంతరం మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. బంగ్లాదేశ్తో జరిగే రెండు టెస్ట్ సిరీస్తో టీమిండియా క్రికెట్ షెడ్యూల్ పున: ప్రారంభం కానుంది. వచ్చే నాలుగు నెలల్లో టీమిండియా 10 టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. దాంతో అత్యుత్త టెస్ట్ టీమ్ను ఎంపిక చేసేందుకు టీమిండియా మేనేజ్మెంట్, సెలెక్టర్లు మాస్టర్ ప్లాన్ రచించారు.అందుకు ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ 2024ని ఉపయోగించుకోవాలనుకుంటున్నారు. ఇప్పటికే టీమిండియా స్టార్ ఆటగాళ్లందరిని దులీప్ ట్రోఫీ ఆడాలని ఆదేశించారు. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ తదితర ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్లోకి రీఎంట్రి ఇవ్వనున్నారు.

**నాలుగు జట్లతో..** సాధారణంగా దులీప్ ట్రోఫీలో ఈస్ట్, సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్ ఈస్ట్ జోన్స్ ఆడుతాయి. కానీ ఈసారి సెలెక్టర్లు ఈ టోర్నీని నాలుగు జట్లతోనే ఆడించాలనుకున్నట్లు తెలుస్తోంది. భారత సీనియర్, భారత్-ఏ ఆటగాళ్లతో పాటు రంజీ క్రికెట్లో సత్తా చాటిన డొమెస్టిక్ క్రికెటర్లతో కలిపి ఏ, బీ, సీ, డీ జట్లతో ఈ టోర్నీని నిర్వహించాలని అజిత్ అగార్క సారథ్యంలోని సెలక్షన్ కమిటీ నిర్ణయించినట్లు సమాచారం. ఈ టోర్నీ ద్వారా భారత ఆటగాళ్లకు సరైన మ్యాచ్ ప్రాక్టీస్ అందించడంతో పాటు.. అత్యుత్తమ టాలెంట్ను బయటకు తీయాలని అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నారంట. ఈ టోర్నీలో పాల్గొనే నాలుగు జట్లకు రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, శుభ్మన్ గిల్, రిషభ్ పంత్ కెప్టెన్లుగా వ్యవహరించే అవకాశం ఉంది.

**నాలుగు జట్లు సమతూకంగా..** నాలుగు జట్లకు అవసరమయ్యే ఓపెనర్లు, మిడిలార్డర్ బ్యాటర్లు, వికెట్ కీపర్లు, ఆల్రౌండర్లు, స్పిన్నర్లతో పాటు పేసర్లను ఎంపిక చేయడంపై భారత సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.ఈ టోర్నీ ద్వారా దేశవాళీ ఆటగాళ్లకు కూడా సీనియర్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకునే అవకాశం లభించనుంది. బీసీసీఐ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీ సెప్టెంబర్ 5 నుంచి 24 వరకు జరగాల్సి ఉంది. అయితే టోర్నీని నాలుగు జట్లకు కుదిస్తే.. షెడ్యూల్లో కూడా స్వల్ప మార్పులు జరగనున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి బంగ్లాదేశ్తో టెస్ట్ సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దులీప్ ట్రోఫీని ఇంకాస్త ముందుగానే ముగించే అవకాశం ఉంది. అయితే ఈ టోర్నీ నిర్వహణ గురించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**దులీప్ ట్రోఫీ 2024 కోసం**
**ఎంపిక చేసే నాలుగు జట్లుఅంచనా**

భారత్-ఏ: రోహిత్ శర్మ(కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, తిలక్ వర్మ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్(కీపర్), వాషింగ్టన్ సుందర్, షామ్స్ ములాని, మహమ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ

భారత్-బీ: జస్ప్రీత్ బుమ్రా(కెప్టెన్), యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే, సూర్యకుమార్ యాదవ్, కేఎస్ భరత్(కీపర్), సాయి కిషోర్, కుల్దీప్ యాదవ్, అర్ష్దీప్, ఉమ్రాన్ మాలిక్

భారత్-సీ: శుభ్మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, అభిమన్యు ఈశ్వర్, విరాట్ కోహ్లీ, రింకూ సింగ్, ధ్రువ్ జురెల్, అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్, ఉమేశ్ యాదవ్, అర్ష్దీప్ సింగ్, మయాంక్ యాదవ్





### బంగ్లాదేశ్ టెస్ట్ సిరీస్‌కు

# జస్ప్రీత్ బుమ్రా దూరం

సొంతగడ్డపై బంగ్లాదేశ్తో జరగనున్న రెండు టెస్ట్ల సిరీస్కు టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా దూరం కానున్నాడు. వర్క్లోడ్ మేనేజ్మెంట్లో భాగంగా అతనికి బంగ్లాదేశ్తో టెస్ట్ సిరీస్కు రెస్ట్ ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 19 నుంచి భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య రెండు మ్యాచ్ల టెస్ట్ సిరీస్ మొదలవ్వనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ 2025లో భాగంగా జరిగే ఈ సిరీస్ గెలవడం భారత్కు చాలా కీలకం. గాయంతో భారత జట్టుకు దూరంగా ఉన్న మహమ్మద్ షమీతో ఈ సిరీస్తోనే రీఎంట్రి ఇవ్వనున్నాడు. దాదాపు 10 నెలల సుదీర్ఘ విరామం తర్వాత అతను మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. అయితే ఓ జాతీయ చానెల్ వివరాల ప్రకారం ఈ సిరీస్కు జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తు టెస్ట్ సిరీస్ల నేపథ్యంలోనే టీమిండియా మేనేజ్మెంట్ అతనికి విశ్రాంతి ఇవ్వాలనుకుంటుందంట. అయితే బుమ్రాకు రెస్ట్ ఇవ్వాలనే విషయంపై సెలెక్టర్లు ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. వచ్చే నాలుగు నెలల్లో భారత్ 10 టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. ఇందులో ఆస్ట్రేలియా గడ్డపైనే ఐదు టెస్ట్ మ్యాచ్ల ఆడనుంది. నవంబర్లో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. బంగ్లాదేశ్తో టెస్ట్ సిరీస్ అనంతరం సొంతగడ్డపైనే న్యూజిలాండ్తో మూడు టెస్ట్ల సిరీస్ ఆడనుంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో ఉన్న కీలక టెస్ట్ సిరీస్ల నేపథ్యంలోనే బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని మేనేజ్మెంట్ భావిస్తున్నట్లు అర్థమవుతోంది. డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ చేరాలంటే ఈ రెండు సిరీస్లో భారత్ విజయం సాధించడం చాలా కీలకం. జస్ప్రీత్ బుమ్రా చివరి సారిగా టీ20 ప్రపంచకప్ 2024 ఆడాడు. ఆ తర్వాత విశ్రాంతి పేరిట అతన్ని శ్రీలంక పర్యటనకు ఎంపిక చేయలేదు. ఇప్పుడు బంగ్లాదేశ్తో టెస్ట్ సిరీస్కు దూరంగా ఉంచాలనుకుంటున్నారు. టెస్ట్లోనూ బుమ్రాకు మెరుగైన రికార్డ్ ఉంది. ఇప్పటి వరకు 36 మ్యాచ్లు ఆడిన బుమ్రా.. 20.69 సగటుతో 159 వికెట్లు తీసాడు. అత్యుత్తమ ప్రదర్శన 6/27 కాగా.. 10 ఇన్నింగ్స్లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. తన చివరి టెస్ట్ మ్యాచ్ను ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్తో ఆడాడు. మరోవైపు మహమ్మద్ షమీ.. వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం జట్టుకు దూరమయ్యాడు. మెగా టోర్నీలో 24 వికెట్లతో సత్తా చాటిన షమీ.. తీవ్ర గాయంతో జట్టుకు దూరమయ్యాడు. నొప్పితోనే అతను ప్రపంచకప్లో బౌలింగ్ చేశాడు. బంగ్లాదేశ్తో టెస్ట్ సిరీస్కు ముందు బీసీసీఐ... చెన్నై వేదికగా ఓ ప్రాక్టీస్ క్యాంప్ నిర్వహించాలనుకుంటుంది. అంతకుముందు సీనియర్ బ్యాటర్లంతా దులీప్ ట్రోఫీ ఆడాలని ఆదేశించింది. డబ్ల్యూటీసీ ప్రారంభించినప్పటి భారత్ వరుసగా రెండు సార్లు ఫైనల్ చేరి తృాటిలో టైటిల్ కోల్పోయింది. మొదటిసారి విరాట్ కోహ్లీ సారథ్యంలో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్.. రెండో సారి రోహిత్ శర్మ సారథ్యంలో ఆస్ట్రేలియా చేతిలో ఖంగుతిన్నది.

### రిషభ్ పంతే

# ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఐపీఎల్ భవితవ్యంపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా ఉన్న రిషభ్ పంత్.. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలం నేపథ్యంలో జట్టు మారుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ స్థానాన్ని భర్తీ చేసేందుకు రిషభ్ పంత్.. చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే)కు వెళ్తున్నాడనే పుకార్లు వెలువడ్డాయి.రెండేళ్ల క్రితం(2022) ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన రిషభ్ పంత్ దాదాపు 16 నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2024 సీజన్తో అతను మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. మునపటిలా అసాధారణ ప్రదర్శన కనబర్చి టీమిండియాకు ఎంపికయ్యాడు. టీ20 ప్రపంచకప్ 2024లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడి భారత విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. అంతర్జాతీయ క్రికెటర్గా పంత్కు తిరుగు లేకున్నా.. ఐపీఎల్ 2025లో అతను జట్టు మారుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే విషయాన్ని మా వన్ ఇండియా బెంగాలి రిపోర్టర్.. ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ ముందు ప్రస్తావించగా.. అతను ఖండించాడు. రిషభ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోనే ఉంటాడని, అతనే కెప్టెన్గా కొనసాగుతాడని స్పష్టం చేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి రిషభ్ పంత్ తప్పుకుంటున్నాడనే వార్తల్లో నిజం లేదన్నాడు. ఆదివారం మీడియా సమావేశంలో పాల్గొన్న గంగూలీ.. ఈ విషయాన్ని వెల్లడించాడు. హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి రికీ పాంటింగ్ తప్పుకున్నాడని కూడా చెప్పాడు. భారత్కు చెందిన మాజీ ఆటగాడే ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్గా బాధ్యతలు చేపడుతాడని స్పష్టం చేశాడు. అయితే ఆ మాజీ ఆటగాడు ఎవరా? అనేది మాత్రం వెల్లడించలేదు. సౌరవ్ గంగూలీనే ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్గా వ్యవహరిస్తాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.



## గ్రాహం థోర్ప్‌ది ఆత్మహత్య



ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ గ్రాహం థోర్ప్ది సహజ మరణం కాదని, ఆత్మహత్య చేసుకున్నారని ఆయన సతీమణి అమండా వెల్లడించారు. ఈ నెల 5న అనారోగ్య కారణాలతో గ్రాహం థోర్ప్ తుది శ్వాస విడిచారని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ దిగ్గజ క్రికెటర్ అకాల మరణం పట్ల యావత్ క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అయితే గ్రాహం థోర్ప్ అనారోగ్య కారణాలతో మరణించలేదని, బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన సతీమణి తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మానసిక సమస్యలతో బాధపడిన గ్రాహం థోర్ప్, చాలా కాలం పాటు డిప్రెషన్లోకి వెళ్లారని తెలిపారు. అనారోగ్య సమస్యలు తన కుటుంబానికి ఇబ్బందిగా మారయాని భావించి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. తాను ఎంతగానో ప్రేమించే భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నప్పటికీ గ్రాహం అనారోగ్య సమస్యల నుంచి కోలుకోలేకపోయారు. చనిపోతేనే తన భార్య, పిల్లలు సుఖంగా ఉంటారని భావించి బలవన్మరణానికి పాల్పడ్డారు'అని అమండా పేర్కొన్నారు. గత రెండేళ్లుగా గ్రాహం తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, దాంతో ఆయనను ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో ఉంచి చికిత్స అందించామని తెలిపారు.

# మను భాకర్‌తో నీరజ్ చోప్రా పెళ్లి?

### సంచలనంగా మారిన వీడియో!



పారిస్ ఒలింపిక్స్ 2024 ముగింపు వేడుకల సందర్భంగా భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, మహిళా షూటర్ మనూ భాకర్ మాట్లాడుకున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్గా మారింది. ఈ వీడియోలో మనుభాకర్, నీరజ్ చోప్రా చాలా సన్నిహితంగా ఉండటంతో నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తామిద్దరని ఫోటో తీస్తున్న తన తల్లి సుమేధను మను భాకర్ వద్దని చెప్పడం చర్చనీయాంశమైంది. తర్వాత నీరజ్ చోప్రాతో ప్రత్యేకంగా మాట్లాడిన సుమేధ.. అతనితో తలపై ఒట్టు వేయించుకున్నారు. అయితే ఈ ఇద్దరినీ ఫోటో తీస్తుంటే మనుభాకర్ ఎందుకు వద్దన్నారు..? నీరజ్ చోప్రాతో సుమేధ ఏం మాట్లాడారు? ఎందుకు ఒట్టు వేయించుకున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ వీడియో చూస్తుంటే.. మనుభాకర్, నీరజ్ చోప్రాకు ఇంతకుముందే పరిచయం ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ ఇద్దరు మంచి స్నేహితులా? లేక రిలేషన్లో ఉన్నారా? అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. నెటిజన్లు మాత్రం మనుభాకర్, నీరజ్ చోప్రా పెళ్లి ఎప్పుడు..? అంటూ ప్రశ్నిస్తున్నారు. మను భాకర్ తల్లి సుమేధ.. నీరజ్ చోప్రాతో మాట్లాడిన మాటలు కూడా ఈ సందేహాలకు బలం చేకూర్చుతున్నాయి. తన కూతురిని పెళ్లి చేసుకోవాలని నీరజ్ చోప్రాను సమేధ కోరినట్లు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో నీరజ్ చోప్రా రజత పతకం గెలవగా.. పాకిస్థాన్ బల్లెం వీరుడు అర్షద్ నదీమ్ బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈటెను 92.97 మీటర్ల దూరం విసిరిన నదీమ్.. ఒలింపిక్స్లో సరికొత్త రికార్డ్ నమోదు చేశాడు. మరోవైపు నీరజ్ చోప్రా టోక్యో ఒలింపిక్స్ 2020 కంటే మెరుగైన ప్రదర్శన చేసినా అర్షద్ నదీమ్ను ధాటలేకపోయాడు. ఈటెను 89.45 మీటర్లు మాత్రమే విసిరి రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ సారి గోల్డ్ మెడల్ సాధించనందుకు తనను క్షమించాలని భారత ప్రజలను నీరజ్ చోప్రా కోరాడు. మరోవైపు మనుభాకర్ రెండు కాంస్య పతకాలతో సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో మూడో స్థానంలో నిలిచి ఈ ఒలింపిక్స్లో తొలి పతకాన్ని అందించిన మనుభాకర్.. మిక్స్డ 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో సరబ్జ్యోత్ సింగ్తో కలిసి మరో కాంస్య పతకాన్ని అందుకుంది. తద్వారా ఒకే ఒలింపిక్స్లో రెండు పతకాలు సాధించిన తొలి భారత అథ్లెట్గా సత్తా చాటింది. మరో పతకాన్ని మను భాకర్ తృాటిలో కోల్పోయింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో మను భాకర్ నాలుగో స్థానంలో నిలిచింది.

# "తంగలాన్" అన్ని ఎమోషన్స్ ఉన్న ఒక గుడ్ మూవీ

## - హీరో చియాన్ విక్రమ్



చియాన్ విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ "తంగలాన్". ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్ తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. "తంగలాన్" సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్ధ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. "తంగలాన్" సినిమా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తోంది. ఈ రోజు విజయవాడలో "తంగలాన్" చిత్ర ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విక్రమ్ మాట్లాడుతూ – మా "తంగలాన్" మూవీ ప్రమోషన్ కోసం విజయ వాడ రావడం హ్యాపీగా ఉంది. బాబాయ్ హోటల్ లో ఫుడ్ చాలా టేస్టీగా ఉంది. వీవీఐటీ కాలేజ్ విజిట్ చేశాం. అక్కడ స్టూడెంట్స్ ఎనర్జీ సర్ ప్రైజ్ చేసింది. తెలుగు ఆడియెన్స్ మంచి సినిమాకు ఎంతగా సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు. నా 'అపరిచితుడు' సినిమా దేశంలోనే విజయవాడలో అత్యధిక రోజులు ఆడింది. మీ అందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. ఇదొక బ్యూటిఫుల్ అడ్వెంచరస్ మూవీ. డైరెక్టర్ రంజిత్ ఈ సినిమాను అందంగా రూపొందించాడు. తంగలాన్ ఒక మంచి సినిమా. మీరంతా ఎప్పుడెప్పుడు ఈ సినిమాను చూసి మీ రెస్పాన్స్ ఇస్తారా అని వెయిట్ చేస్తున్నాను. నా ఫేవరేట్ డైరెక్టర్ పా రంజిత్ గారితో ఈ మూవీ చేశాను. ప్రేక్షకులందరికీ నచ్చేలా అన్ని ఎమో షన్స్‌తో రంజిత్‌గారు ఈ సినిమాను తెరకెక్కించారు. ఒక కొత్త వరల్డ్ లోకి మిమ్మల్ని "తంగలాన్" సినిమా తీసుకెళ్తుంది. ఆగస్టు 15న తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. అన్నారు.



## మహేష్ ప్రశంసలు అందుకున్న 'కమిటీ కుర్రోళ్ళు'

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న వంశీ నందిపాటి విడుదల చేశారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఇటు ఫ్యామిలీ ఆడియెన్స్, అటు యూత్‌ను ఆకట్టుకున్న ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. అలాగే బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబట్టుకుంటోంది. ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలతో పాటు సినీ సెలబ్రిటీల అప్రిషియేషన్స్ కూడా అందుకుంటోంది. తాజాగా సూపర్ స్టార్ మహేష్ 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర యూనిట్‌ను సోషల్ మీడియా ద్వారా అభినందించారు. "కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు సంబంధించి మంచి విషయాలను విన్నాను. తొలి చిత్రంతో నిర్మాతగా సక్సెస్‌గా సాధించిన నిహారిక కొణిదెలకు అభినందనలు. సినిమాలో సక్సెస్‌లో భాగమైన చిత్ర యూనిట్‌కు అభినందనలు. సినిమాను త్వరలోనే చూస్తాను' అంటూ మహేష్ తెలియజేశారు.'కమిటీ కుర్రోళ్ళు' చిత్రంలో సీనియర్ నటీనటులతో పాటు 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్‌ను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ మేకర్స్ చేసిన ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ ప్రేక్షకులు సినిమాను ఆదరించారని ..ఆదివారం కూడా ప్రేక్షకాదరణ పొందుతుందని, కలెక్షన్స్ మరింత పెరుగుతాయని ట్రేడ్ వర్గాలంటున్నాయి.

## చూపుతిప్పుకోలేని 'కంగువ' ధీరత్వం



స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ'. ఈ చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 10న దసరా పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ ను రిలీజ్ చేశారు. మెస్మరైజింగ్ మేకింగ్ తో 'కంగువ' ట్రైలర్ ఆకట్టుకుంది.'కంగువ' ట్రైలర్ ఎలా ఉందో చూస్తే – ఒక అందమైన దీవిని పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. రహస్యాలెన్నో ఆ దీవిలో దాగిఉన్నాయి. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ కనిపించారు. అతనే ఒక సైన్యం లాంటి కంగువ పాత్రలో సూర్య మేకోవర్, ఫెరోషియస్ పర్ ఫార్మెన్స్ ట్రైలర్ కు హైలైట్ గా నిలుస్తోంది. నాయకుడిగా తన వారిని కాపాడుకునేందుకు కంగువ చూపించే ధీరత్వం, చేసే సాహసోపేత పోరాటాలు చూపు తిప్పుకోలేకుండా ఉన్నాయి. భారీ నౌకలపై జరిగే యుద్ధ సన్నివేశాలు వరల్డ్ సినిమాను గుర్తుచేసేలా ఉన్నాయి. హై క్వాలిటీ విజువల్ ఎఫెక్టులు మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

## సెప్టెంబర్ 13న 'ఉత్సవం'

దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఇంపాక్ట్ ఫుల్ తెలుగు డ్రామా 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వం వహిస్తున్నారు. హార్నిబిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ 13న ఈ సినిమా విడుదల కానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది.



ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, పాటలు చాలా క్యురియాసిటీని క్రియేట్ చేశాయి. 'ఉత్సవం' లవ్, ఎమోషన్స్, భావోద్వేగాలు వినోదంతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్.బి. శ్రీరామ్, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి, ఆమని, సుధ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' ఫస్ట్ సాంగ్ షూట్



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ న్యూ మూవీ 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో డైరెక్టర్ గా పరిచయమౌతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లావిష్ గా నిర్మిస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో కొన్ని టాకీ పార్ట్‌లతో పాటు పాటలను కూడా షూట్ చేస్తున్నారు. తాజాగా సిద్దూ జొన్నలగడ్డ, రాశి ఖన్నాలపై సినిమా మొదటి పాటను చిత్రీకరించడం ప్రారంభించారు. థమన్ స్కోర్ చేసిన చార్ట్‌బస్టర్ సాంగ్ కు కెకె లిరిక్స్ రాశారు. ఇటీవలే నా సామి రంగాతో దర్శకుడిగా పరిచయం అయిన విజయ్ బిన్నీ హ్యూజ్ సెట్‌లో చిత్రీకరిస్తున్న పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాటకు సిద్ శ్రీరామ్ వోకల్స్ అందించనున్నారు. ఇది 30 రోజుల పాటు సాగే క్రూషియల్ షెడ్యూల్. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్ గా నటిస్తుండగా, వైవా హర్ష కీలక పాత్రలో కనిపించనున్నారు. సిద్ధు జొన్నలగడ్డ తన పాత్ర కోసం స్టైలిష్ మేకోవర్ అయ్యారు. నిర్మాత టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాని హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు.

## "స్వాతంత్రం మా స్వాతంత్ర్యం" సాంగ్ లాంచ్ చేసిన తమ్మారెడ్డి




తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ స్థాపించి ఆహారం మాది ఆరోగ్యం మీది అనే నినాదంతో కొంత మంది డైటీషియన్స్ మరియు కొంతమంది డాక్టర్స్‌ను కలుపుకొని కూరగాయలతో కొన్ని వంటకాలు కనిపెట్టి ఎంతోమందికి దీర్ఘకా లిక వ్యాధిల్ని తగ్గిస్తున్న లక్ష్మణ్ పూడి తను మాతృ సంస్థ ప్రజానాట్యమండలి రూపకల్పనలో ఎం శేషగిరి రచించిన పాటను శ్రీనివాస్ నందుల సంగీత సారథ్యంలో లక్ష్మణ్ పూడి గానం చేసినటువంటి స్వాతంత్రం మా స్వాతంత్ర్యం అనే పాటను దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయ్యింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన దేశం ఆర్థికంగా, టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి చెందింది. కానీ నిరక్షరాస్యత, పేదరికంలో చాలా కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిస్థితులు అన్నిటిని దృష్టిలో పెట్టుకుని లక్ష్మణ్ పూడి గారు స్వాతంత్ర్యం మీద చేసిన సాంగ్ అద్భుతంగా ఉంది అన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి గాయకుడు లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ నేను కారులో వెళుతున్నప్పుడు సిగ్నల్స్ దగ్గర భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నవారికి, స్వాతంత్ర్యం అంటే ఏమిటో తెలి యదు. దేశంమీద ప్రేమతో ఇలాంటి నిరక్షరాస్యులను పాటతో మేల్కొల్పటానికి ఈ సాంగ్ చేయడం జరిగింది.

## 'ఉరుకు పటేల' నుంచి 'పట్నం పిల్ల..' లిరికల్ సాంగ్



హుషారు వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తేజస్ కంచర్ల. ఇప్పుడు మరింతగా ప్రేక్షకులకు దగ్గరయ్యే కథాంశాలతో సినిమాలు చేయటంపై తన దృష్టిని సారిస్తున్నారు. అందులో భాగంగా తేజస్ చేస్తోన్న తాజా చిత్రం 'ఉరుకు పటేల'తో ఆడియెన్స్‌ను అలరించబోతున్నారు.'గెట్ ఉరికిఫైడ్' సినిమా ట్యాగ్ లైన్. సెప్టెంబర్ 13న సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ మూవీ నుంచి 'పట్నం పిల్ల..' అనే సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం. లిరికల్ సాంగ్ గమనిస్తే.. హీరోయిన్ పట్నం నుంచి సెలవులకు పల్లెటూరుకి వస్తుంది. అక్కడ హీరో ఆమెను చూసి మనసు పారేసుకుంటాడు. తన మనసులోని ప్రేమలో తెలియజేసేందు తను పడే పాట్లు, మనసులోని భావాలను వ్యక్తం చేసే పాట ఇదని అర్థమవుతుంది. ఈ చిత్రానికి ప్రవీన్ లక్కరాజు సంగీతం అందిస్తున్నారు. 'పట్నం పల్ల..' పాటను కాసర్ల శ్యామ్ రాయగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## 'కన్నప్ప' నుంచి 'చండుడు' కారెక్టర్ లుక్ పోస్టర్



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం ఒక అప్డేట్ వస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. చెప్పినట్టుగానే విష్ణు మంచు తన చిత్రం నుంచి ప్రతీ సోమవారం ఒక అప్డేట్‌ను వదులుతున్నారు. సినిమాలోని విభిన్న పాత్రలను పోషించిన దిగ్గజ నటీనటుల పోస్టర్‌లను రిలీజ్ చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి మధుబాల, శరత్ కుమార్, దేవరాజ్ వంటి వారు పోషించిన పాత్రలకు సంబంధించిన పోస్టర్‌లను రిలీజ్ చేసి అంచనాలు పెంచేశారు. తాజాగా ఈ చిత్రంలో నటుడు సంపత్ పోషించిన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అడివినే భయాభ్రాంతుల్ని చేసే భీకర జాతి.. నల్ల కనుమ నేలలో పుట్టారు.. మొసళ్ల మడుగు నీరు తాగి పెరిగారు.. భిల్ల జాతి అధినేత చండుడు అంటూ భీకరమైన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. నటుడు సంపత్ ఈ కారెక్టర్‌లో అందరినీ మెప్పించేలా కనిపిస్తున్నారు. గెటప్ చాలా కొత్తగా కనిపిస్తోంది. కన్నప్ప చిత్రంలో డా.మోహన్ బాబు, మోహన్ లాల్, ప్రభాస్, బ్రహ్మానందం, బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ భాగమైన సంగతి తెలిసిందే.

## 'ముఫాసా: ది లయన్ కింగ్'



ఓ రాజు మరియు అతని వంశం మారోసారి అడవిని పాలిస్తారు! షారూఖ్ ఖాన్, ఆర్యన్ ఖాన్ మరియు అబ్రామ్ ఖాన్ మొదటిసారిగా కలిసి నటించారు. డిస్నీ యొక్క ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కుటుంబం యొక్క హిందీ వెర్షన్ కోసం వాయిస్ ఇవ్వడానికి సమయం ఆసన్నమైంది . ఎంటర్‌టైన్ 'ముఫాసా : ది లయన్ కింగ్!' దర్శకుడు భారీ జెంకిన్స్ యొక్క ముఫాసా: ది లయన్ కింగ్ భారతదేశంలో 20 డిసెంబర్ 2024న ఆంగ్లం, హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో విడుదల కానుంది..

అడవి యొక్క అంతిమ రాజు 'ముఫాసా: ది లయన్ కింగ్' యొక్క వారసత్వాన్ని లోతుగా పరిశోధించే సమయం ఇది. ఇంకా అతిపెద్ద నటీనటులతో హిందీలో ప్రాణం పోశారు. లెజెండరీ తప్ప మరెవ్వరూ నటించలేదు. షారుఖ్ ఖాన్ మరియు అతని కుమారలు ఆర్యన్ ఖాన్ మరియు అబ్రామ్. యాక్షన్ ది లయన్ కింగ్, షారుఖ్ ఖాన్ ముఫాసాగా తిరిగి ప్రేక్షకులను తీసుకు వెళ్లాడు. అడవి యొక్క మూలాలు. అతనితో పాటు అతని పిల్లలు, సింబగా ఆర్యన్ మరియు అబ్రామ్ యువ ముఫాసా. ఈ సంవత్సరం ఎదురుచూసిన విడుదల, దృశ్యపరంగా అద్భుతమైన లైవ్-యాక్షన్ ముసాఫా : ది లయన్ కింగ్. భారతీయ సినిమా యొక్క కింగ్ మరియు అతని గురుత్వాకర్షణలతో సుపంపన్నమైన హిందీ టీజర్ ను ఆవిష్కరించింది వంశం. సువన్నా హృదయంలోకి ఈ అసాధారణ ప్రయాణంతో ఆకర్షితులవడానికి సిద్ధం! ఈ సంవత్సరం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న విడుదల, దృశ్యమానంగా ఉత్కంఠభరిత మైనలైవ్-యాక్షన్ 'ముఫాసా : ది లయన్ కింగ్'. దానిని ఆవిష్కరించింది హిందీ ట్రైలర్, ఇప్పుడు భారతీయ సినిమా కింగ్ ఖాన్ మరియు అతని పిల్లలు ట్రైలర్ లింక్ కమాండింగ్ ఉనికిని కలిగి ఉంది. అసోసియేషన్ గురించి షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ 'సాఫాసాకు అద్భుతమైన వారసత్వం మరియు స్టాండ్ ఉంది. అడవికి అంతిమ రాజుగా, తన జ్ఞానాన్ని తన కొడుకు సంబాకు అందించాడు. నేను అతనితో లోతుగా సంబంధం కలిగి ఉన్నాను.

## ప్రఖ్యాత కూచిపూడి డ్యాన్సర్, నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం

ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి, విమర్శకుల ప్రశంసలు అందుకున్న తెలుగు నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వానం అందింది. 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో నిర్వహించే ఎట్ హోమ్ సెలబ్రేషన్స్‌కి ఆహ్వానిస్తూ లేఖ అందింది.

తన తొలి చిత్రం నాట్యంతో రెండు జాతీయ పురస్కారాలను దక్కించుకున్న ఘనత సంధ్యారాజుకు సొంతం. తమిళనాడు బేస్డ్ వ్యాపారవేత్త, రామ్‌కో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ పి.ఆర్.వెంకట్రామరాజా పుత్రిక సంధ్యారాజు. హైదరాబాద్‌లో నిశృంఖల డ్యాన్స్ అకాడెమీ, నిశృంఖల ఫిల్మ్ ఫౌండర్‌గా అనేక కార్యకలాపాలు చేస్తున్నారు. తన నృత్య కళతో ప్రపంచ యవనిక మీద అసమానమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు సంధ్యారాజు. ప్రత్యక్ష నృత్య ప్రసారాల్లో పాల్గొనడమే కాదు, చలనచిత్ర రంగంలోనూ తనదైన ముద్రతో దూసుకుపోతున్నారు.



## "ధూం ధాం" టీజర్ విడుదల

## సెప్టెంబర్ 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు "ధూం ధాం" సినిమా టీజర్ ను స్టార్ హీరో గోపీచంద్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ శ్రీను వైట్ల చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీను వైట్ల మాట్లాడుతూ – "ధూం ధాం" సినిమా టీజర్ చాలా బాగుంది. చాలా కలర్ ఫుల్ గా కనిపిస్తోంది. "ధూం ధాం" సినిమాకు పనిచేసిన టీమ్ లో చాలా మంది నాకు దగ్గరి వాళ్లు. గోపీ మోహన్ నాతో ఎంతగా ట్రావెల్ చేశాడో మీకు తెలుసు. ఆయన మంచి సెన్సబుల్ రైటర్. ఈ సినిమాకు మంచి స్టోరీ స్క్రీన్ ప్లే చేశారు. డైరెక్టర్ సాయి కిషోర్ నా దగ్గర డైరెక్షన్ డిపార్ట్ మెంట్ లో దుబాయ్ శీను నుంచి బాద్ షా మూవీ వరకు వర్క్ చేశాడు. ప్యాషన్, డెడికేషన్ ఉన్న డైరెక్టర్. నిర్మాత రామ్ కుమార్ గారు నాకు మంచి మిత్రులు. ఆయన విదేశాల్లో ఉండి సినిమా మీద ప్యాషన్ తో ఇండస్ట్రీకి వచ్చారు. ఎ

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044